
# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com



**గమనిక** పండుగ సందర్భంగా బుధవారం 'ఈ-కబురు' కార్యాలయానికి సెలవు. గురువారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 29వ తేదీ శుక్రవారం.

(తేదీ) 27-08-2025 (వారం) బుధవారం · హైదరాబాద్ పేజీలు–6 · e-kaburu.com

## 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు



• ఈ కబురు, హైదరాబాద్: ఈ నెల 30 నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. శాసనసభతో పాటు మండలి సమావేశాలు సైతం జరగనుండగా, ఎన్నిరోజులు సమావేశాలు నిర్వహించాలనే దానిపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన విచారణ నివేదికపై సభలో చర్చించే అవకాశం ఉంది.

తరువాయి 2లో

## ఉత్పత్తుల్లో మనదేశీయుల చెమట చిందాలి



పెట్టుబడి ఎవరు పెట్టినా ఉత్పత్తులు మనదేశంలో జరగాలి: మోదీ

తరువాయి 2లో

## వచ్చే నెలలోనే బీజేపీకి కొత్త బాస్

• పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఆపరేషన్ సిందూర్‌తో ఇప్పటికే పలుమార్లు వాయిదాపడిన బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు ముహూర్తం దగ్గరపడిందా ఉప రాష్ట్రపతి ఎన్నికలు పూర్తవగానే కొత్త అధ్యక్షుడు రానున్నారా...

• రేసులో ఉన్న నేతల జాబితా ఇప్పటికే సిద్ధం



తరువాయి 2లో

## వొడాఫోన్ ఐడియాకు ఉపశమనంపై స్పష్టత

» 4లో

vodacom

## ఇది కలా.. నిజమా? నన్ను నేను గిల్లి చూసుకుంటున్నా..: మాళవిక మోహనన్

» 5లో



## మంత్రుల కమిటీ నివేదిక ఆలస్యం



• జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, అభిషేక్ సింఘ్వీతో సంప్రదింపుల్లో బీసీలకు 42శాతంపై రాని స్పష్టత!

• మరికొందరు నిపుణులతో చర్చించనున్న కమిటీ

• క్యాబినెట్ భేటీలోపు నివేదిక సమర్పించే అవకాశం

హైదరాబాద్, ఈ కబురు: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే అంశంపై మంత్రుల కమిటీ.. టీపీసీసీకి నివేదిక ఇవ్వడం కొంత ఆలస్యం కానుంది. హైదరాబాద్‌లో ఆదివారం ఆడిటర్ జనరల్‌తో, ఢిల్లీలో సోమవారం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో మంత్రుల కమిటీ సమావేశమై చర్చించిన విషయం తెలిసిందే. అయితే ఈ భేటీలో స్పష్టత రాకపోవడంతో మరికొందరు న్యాయ నిపుణుల అభిప్రాయాలనూ తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. వాస్తవానికి టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకు న్యాయనిపు

తరువాయి 2లో

## స్థానిక ఎన్నికలపై డైలమా!

• ఎన్నికల నిర్వహణకే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు!

• హైకోర్టు గడువు ముంచుకొస్తున్నా ఎటూ తేల్చుకోలేని పరిస్థితి

• పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి వెళితే బూమరాంగ్ అవుతుందనే ఆందోళన

• 42%రిజర్వేషన్లతో జీవో ఇవ్వడమే ప్రత్యామ్నాయమనే ప్రతిపాదన తెరపైకి



తరువాయి 3లో

## రాహుల్.. ప్రియాంక.. మధ్యలో రేవంత్!

ఓటర్ అధికార్ యాత్ర'లో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి.. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు.



• బిహార్‌లో అత్యంత ప్రాధాన్యమిచ్చిన కాంగ్రెస్ అగ్రనేతలు
• ఢిల్లీ నుంచి వారితోపాటు ప్రత్యేక విమానంలో ప్రయాణం
• రాహుల్, ప్రియాంకతో కలిసి ఓటర్ అధికార్ యాత్రలో..
• బిహార్ ఎన్నికల్లో పార్టీ పరిస్థితిపై రాహుల్‌గాంధీతో చర్చ
• తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపైనా!
• రేవంత్‌తోపాటు పాల్గొన్న మహేశ్‌గౌడ్, మంత్రులు
• కుట్రతో ఓట్ల చోరీకి పాల్పడుతున్నారు: ప్రియాంకాగాంధీ

హైదరాబాద్/న్యూఢిల్లీ,ఈ కబురు: 'ఓటర్ అధికార్ యాత్ర'లో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి.. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. మంగళవారం ఢిల్లీ నుంచి బిహార్ రాష్ట్రంలోని దర్భంగా వరకు ప్రత్యేక విమానంలో వెళ్లిన ఇద్దరు నేతలు.. రేవంత్‌రెడ్డిని కూడా వెంటబెట్టుకుని వెళ్లారు.

» 2లో

## సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితాల ప్రచురణ



**డీపీవోలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు**

**ఎస్ఈసీ నోటిఫికేషన్ జారీ**

ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి...రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సన్నాహాలు వేగవంతం చేసింది. ఎన్నికలకు సన్నద్ధం కావడంలో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందుకు అనుగుణంగా జాబితాలను సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారులను (డీపీవో) ఆదేశిస్తూ మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని నోటిఫికేషన్ జారీచేశారు.

తరువాయి 2 లో


## దొంగ ఓట్లంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం.. ప్రజల్ని అవమానించడమే: బండి సంజయ్

» 3లో




## నేను ఆ కార్డ్స్ ఆడితే.. చైనాకు వినాశనమే: ట్రంప్ వార్నింగ్

» 3లో



## కొత్త చట్టం అధికారపార్టీకి చుట్టమైతే?

• ఈ కబురు:ప్రత్యేకించి కేంద్రంలో పూర్తి మెజార్టీ లేని నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌లను కట్టడి చేయడానికి కూడా దీన్ని వాడవచ్చని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఈ బిల్లుపై టీడీపీ, జేడీ(యూ)లు కూడా మథన పడుతున్నట్లుగా కనిపిస్తుంది. ఈ చట్టాన్ని కేంద్రం చిత్తశుద్ధితోనే చేస్తుంటే ఎవరికి అభ్యంతరం ఉండదు.కాని మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటీవలికాలంలో పెడదోరణులు ప్రబలిపోయాయి.



తరువాయి 2లో

## యూరియా కోసం రైతుల అవస్థలు



• రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర అవస్థలు పడుతుంటే..
• ముఖ్యమంత్రి, మంత్రులెక్కడ?: కేటీఆర్

తరువాయి 3లో

ఈ-కబురు
27-08-2025
బుధవారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

# మంత్రుల కమిటీ నివేదిక ఆలస్యం



హైదరాబాద్, ఈ కబురు: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే అంశంపై మంత్రుల కమిటీ.. టీపీసీసీకి నివేదిక ఇవ్వడం కొంత ఆలస్యం కానుంది. హైదరాబాద్‌లో ఆదివారం ఆడిటర్ జనరల్‌తో, ఢిల్లీలో సోమవారం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో మంత్రుల కమిటీ సమావేశమై చర్చించిన విషయం తెలిసిందే. అయితే ఈ భేటీలో స్పష్టత రాకపోవడంతో మరికొందరు న్యాయ నిపుణుల అభిప్రాయాలనూ తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. వాస్తవానికి టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకు న్యాయనిపుణులతో మంత్రుల కమిటీ సంప్రదింపులు పూర్తి చేసి మంగళవారం కల్లా టీపీసీసీకి నివేదిక సమర్పించాల్సి ఉంది. అయితే మరికొందరు నిపుణులనూ సంప్రదించాలన్న నిర్ణయం నేపథ్యంలో నివేదిక సమర్పణ ఒకటి, రెండు రోజులు ఆలస్యం కానుంది. శాసనసభ తీర్మానం ఆధారంగా జీవో ఇచ్చి ముందుకు వెళ్లాలా? లేక పార్టీ పరంగా నిర్ణయం తీసుకుని వెళ్లాలా? అన్నదానిపైన స్పష్టత రాకపోవడం వల్లనే మంత్రుల కమిటీ విస్తృత అభిప్రాయ సేకరణ చేపట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ నెల 30న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఈ లోపే మంత్రుల కమిటీ.. అభిప్రాయ సేకరణ పూర్తి చేసి నివేదికను పార్టీకి సమర్పించనుందని, ఆ నివేదికపై టీపీసీసీ కోర్ కమిటీ సమావేశమై ఒక నిర్ణయానికి రానుందని అంటున్నారు. కోర్ కమిటీలో తీసుకున్న నిర్ణయానుసారం.. ప్రభుత్వ పరంగా క్యాబినెట్లో నిర్ణయం జరగనుందని చెబుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

# రాహుల్.. ప్రియాంక.. మధ్యలో రేవంత్!



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఈ కబురు: 'ఓటర్ అధికార్ యాత్ర'లో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి.. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. మంగళవారం ఢిల్లీ నుంచి బిహార్ రాష్ట్రంలోని దర్భంగా వరకు ప్రత్యేక విమానంలో వెళ్లిన ఇద్దరు నేతలు.. రేవంత్‌రెడ్డిని కూడా వెంటబెట్టుకుని వెళ్లారు. ఓటర్ అధికార్ యాత్రలో కూడా రాహుల్, ప్రియాంకతోపాటే ప్రత్యేక వాహనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. తనకు ఇరువైపులా.. రాహుల్, ప్రియాంకతో ఆ యాత్రలో రేవంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కాగా, ప్రత్యేక విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు.. రేవంత్‌తో బిహార్ ఎన్నికలు, తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై రాహుల్‌గాంధీ ముచ్చటించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే అంశం ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు. దీనిపై మంత్రుల కమిటీ నియామకం, న్యాయ నిపుణుల సూచన మేరకు ముందుకెళ్లాలని టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీలో నిర్ణయం తీసుకున్న విషయాన్ని రాహుల్‌కు సీఎం రేవంత్ వివరించారు. దీనిపై ఈ నెల 30న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. కాగా, ఓటరు అధికార యాత్రలో తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. యాత్ర ముగిసిన తర్వాత.. దర్భంగా విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో సీఎం, మంత్రులు హైదరాబాద్‌కు చేరుకున్నారు

మొదటి పేజీ తరువాయి

# వచ్చే నెలలో నే బీజేపీకి కొత్త బాస్



**న్యూఢిల్లీ, ఈ కబురు: పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఆపరేషన్ సిందూర్‌తో ఇప్పటికే పలుమార్లు వాయిదాపడిన బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు ముహూర్తం దగ్గరపడిందా? ఉప రాష్ట్రపతి ఎన్నికలు పూర్తవగానే కొత్త అధ్యక్షుడు రానున్నారా? నూతన అధ్యక్షుడి ఆధ్వర్యంలోనే బీజేపీ బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనుందా? ఈ ప్రశ్నలకు బీజేపీ వర్గాలు అవుననే చెబుతున్నాయి. సెప్టెంబర్ నెలాఖరులో బిహార్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, ఆలోగానే బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడు వస్తారని అంటున్నాయి. వచ్చే నెల 9న ఉప రాష్ట్రపతి ఎన్నికల తర్వాత పార్టీ అధ్యక్ష పదవికి సంప్రదింపులు ప్రారంభం కానున్నాయని.. అధ్యక్ష పదవి రేసులో ఉన్న నాయకుల జాబితా ఇప్పటికే సిద్ధమైందని విశ్వసనీయ వర్గాలు తెలిపా యి. నూతన జాతీయాధ్యక్షుడి ఎంపికలో కులం, ప్రాంతం, సామాజిక వర్గ సమీకరణాల ప్రాతిపదిక ఏమీ ఉండకపోవచ్చని.. జాతీయ స్థాయిలో నిరూపితమైన సంస్థాగత అనుభవమున్న నాయకుడికే పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నాయి. ఒకవేళ బిహార్ ఎన్నికలకు ముందే జాతీయాధ్యక్షుడి ఎన్నిక జరగకపోతే.. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాకే ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపాయి.**

మొదటి పేజీ తరువాయి

# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు



కాగా అదేరోజు రాష్ట్ర మంత్రివర్గం కూడా సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం ఒంటి గంటకు కేబినెట్ భేటీ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంలో ఎదురవుతున్న ఆటంకాలు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనపై ప్రత్యేక దృష్టి

ఒకవైపు సెపెటెంబర్ 30 లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు విధించిన గడువు సమీపిస్తోంది. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి మరో ప్రయత్నంగా ఆర్డినెన్స్‌లను రూపొందించి పంపగా వాటిని సైతం గవర్నర్ రాష్ట్రపతికి సిఫారసు చేయడంతో ప్రభుత్వం తీవ్ర ఇరకాటంలో పడింది. ఈ నేపథ్యంలోనే పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలపై కేబినెట్ చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

కాళేశ్వరం కమిషన్ నివేదిక, యూరియా కొరత తదితరాలపై..

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన విచారణ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి చర్చించాలని భావిస్తున్న నేపథ్యంలో.. దీనిపై సైతం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అలాగే రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరత, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ గృహాల నిర్మాణం, ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగ నియామకాలు తదితర అంశాలను కూడా మంత్రివర్గం పరిశీలించే అవకాశం ఉంది.

# కొత్త చట్టం అధికారపార్టీకి చుట్టమైతే?



తమ ప్రత్యర్థులను ఎలాగైనా అణచివేయాలని, తద్వారా శాశ్వతంగా తామే అధికారంలో ఉండాలన్న తాపత్రాయం మన నాయకులలో అధికంగా కనిపిస్తోంది. ప్రజాస్వామ్యయుతంగా ఎంతకాలం పాలనలో ఉన్నా ఫర్వాలేదు. అలా కాకుండా నియంతృత్వ ధోరణిలో వ్యవహరిస్తుండడమే ఇబ్బందిగా మారుతోంది. గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో న్యాయస్థానం ఒక తీర్పు ఇచ్చింది. ఎవరైనా ప్రజాప్రతినిధి రెండేళ్లు జైలు శిక్షకు గురైతే వెంటనే అతను పదవికి అనర్హుడవుతాయన్నది దాని సారాంశం. దానివల్ల అనర్థాలు రావచ్చని తలంచిన మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఆ తీర్పును రివర్స్ చేస్తూ ఒక ఆర్డినెన్స్ తీసుకు వచ్చింది. కానీ అప్పట్లో రాహుల్ గాంధీ అవగాహనా రాహిత్యంతో ఆ ఆర్డినెన్స్ కాపీని బహిరంగంగానే చించివేశారు. ఒక రకంగా ఇది తన ప్రభుత్వాన్ని తానే అవమానించుకున్నట్లు కాదా! పైగా ఆనాటి ప్రదాని మన్మోహన్ సింగ్ పై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. అలాంటి వ్యక్తి నేతృత్వంలో వచ్చిన ఆ ఆర్డినెన్స్ పూర్వాపరాలు ఆలోచించకుండా అనుచితంగా ప్రవర్తించడంతో ఆ తీర్పు అమలులోనే ఉంది. దాని ఫలితంగా కొందరు తమ పదవులు కోల్పోయారు. ఉదాహరణకు లాలూ ప్రసాద్ యాదవ్‌కు శిక్ష పడడంతో రాజ్యసభ సభ పదవి పోయింది. ఆ తర్వాత కాలంలో రాహుల్ గాంధీనే ఒక కేసులో రెండేళ్లకు పైగా శిక్షకు గురి కావడం, ఆ తర్వాత ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దు కావడం జరిగిపోయింది. తదుపరి ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లి పునరుద్ధరించుకోగలిగారు. అది వేరే సంగతి. రాహుల్ ఈ ఉదంతంలో తాను చేసిన తప్పుకు తానే బలైనట్లే కదా! ఇప్పుడు బీజేపీ కూడా అదే తరహా ప్రయోగం చేస్తోందా? ఒకవేళ వేరే ప్రభుత్వం కేంద్రంలో వస్తే ,అప్పుడు ఇదే చట్టం బీజేపీ ప్రభుత్వాల మెడకు కూడా చుట్టుకునే అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఎవరు అధికారంలో ఉంటే వారు సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్నది వాస్తవం. ప్రధాని నరేంద్ర మోడీ ఒక సభలో మాట్లాడుతూ నేరగాళ్లు జైలు నుంచి పరిపాలించాలా? అని ప్రశ్నించారు. కొంతకాలం క్రితం ఢిల్లీలో లిక్కర్ స్కామ్ అంటూ హడావుడి చేసి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, కొందరు మంత్రులను అరెస్టు చేశారు. ఢిల్లీలో పోలీస్ వ్యవస్థ కేంద్రం చేతిలోనే ఉంటుందన్న సంగతి తెలిసిందే. కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేయకుండా జైలులో ఉంటూనే ప్రభుత్వ విషయాలపై ఆదేశాలు ఇస్తుండేవారు. అలాగే తమిళనాడుకు చెందిన ఒక మంత్రిని ఈడి అరెస్టు చేసింది. ఆయన కూడా పదవికి రాజీనామా చేయకుండా కేబినెట్‌లో కొనసాగారు. ఈ రెండు రాష్ట్రాలు బీజేపీకి అనుకూలంగా లేనివి. ఢిల్లీలో ఎన్నికలకు ముందు ఎలాగైనా ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించాలన్న లక్ష్యంతో బీజేపీ నాయకత్వం లిక్కర్ స్కామ్ పేరుతో కేజ్రీవాల్ ను జైలులో పెట్టిందని అప్పట్లో ప్రతిపక్షం తీవ్రంగా విమర్శించేది. ఇలా కొద్దిమందిని దృష్టిలో ఉంచుకుని ఈ చట్టం తెస్తుండడం కరెక్టేనా అన్న చర్చ ఉంది. నిజంగానే మోడీకి అవినీతి వ్యవహారాలపై చిత్తశుద్ధి ఉంటే ఏపీలో టీడీపీతో పొత్తు ఎలా పెట్టుకున్నారన్న ప్రశ్న వస్తుంది. ఎందుకంటే మోడీని అవినీతిపరుడని, టెర్రరిస్టు అని.. ఇంకా చాలాచాలా మాటలు టీడీపీ అధినేత, 2019 ఎన్నికలకు ముందు కూడా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు విమర్శించేవారు. మోడీ స్వయంగా ఏపీలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుపై పలు అవినీతి ఆరోపణలు చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇస్తుంటే చంద్రబాబు దానిని తనకు ఏటీఎం గా మార్చుకున్నారని ఆరోపించారు. ఎన్నికలలో చంద్రబాబు ఓటమి తర్వాత ఆయన పీఎస్ ఇంటిలో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు జరపగా వివిధ కాంట్రాక్టు వ్యవహారాలలో రెండువేల కోట్ల అక్రమాలు జరిగాయని తేలినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అదే కాదు. స్కిల్ స్కామ్ లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అవినీతికి పాల్పడ్డారని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసింది. అప్పటికే కేంద్రానికి చెందిన ఈడీ అదే కేసులో పలువురిని అరెస్టు చేసింది. చంద్రబాబు వరకు కేసును ఈడీ తీసుకురాలేదు. ఈలోగా టీడీపీతో మళ్లీ బీజేపీ జత కట్టింది. మరి ఇప్పుడు ఆ ఆరోపణలు సంగతేమిటి? అసలు ఆ కేసులలో నిజానిజాలు ఏమిటి? అన్యాయంగా చంద్రబాబు మీద ఆ ఆరోపణలు చేశారా? లేక వాస్తవం ఉందా? అన్నది ప్రజలకు తెలియనవసరం లేదా? తన ప్రభుత్వ ఓటమి తర్వాత చంద్రబాబు ఈ పరిణామాలను ఊహించే తెలివిగా బీజేపీ పెద్దలతో రాజీ చేసుకున్నారన్నది చాలా మంది భావన. ఆ తర్వాత బతిమలాడి బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారన్నది బహిరంగ రహస్యమే. ఇలాంటివాటి గురించి మోడీ జవాబు ఇచ్చే పరిస్థితి ఉందా? ఇప్పుడు కూడా బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలను ఇరుకున పెట్టడానికి, తమ మిత్రపక్షాలైన టీడీపీ, జేడీ(యూ)లను తమ అదుపులో ఉంచుకోవడానికి ఇలాంటి చట్టం తెస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. దానికి తగినట్లుగానే టీడీపీ లోక్‌సభ పక్ష నేత లావు కృష్ణదేవరాయలు ఈ బిల్లును సమర్థిస్తూనే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, లోపాలను సరిదిద్దాలని, జాయింట్ పార్లమెంటరీ కమిటీలో చర్చ జరుగుతుందని అన్నారు. అంటే ఈ బిల్లుపై వారు లోపల భయపడుతున్నట్లు తెలుస్తూనే ఉంది. జేడీ(యూ) నేత త్యాగి కూడా అదే తరహాలో స్పందించారు. కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలలో నిజం ఉన్నా, లేకపోయినా, చంద్రబాబు విషయంలో బీజేపీ అనుసరించిన ద్వంద్వ విధానం సహజంగానే ఈ సందేహాలకు తావిస్తుంది. ఇండియా కూటమి లోనే అవినీతిపరులు ఉన్నట్లు తమ పక్షంలో ఎవరూ లేనట్లు మోడీ మాట్లాడినా జనం ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలో అవినీతి ఆరోపణలు వచ్చినా ఎందరిపై కేసులు పెడుతున్నారు? దేశ ప్రధాని మీద కేసు పెట్టే పరిస్థితి ఉందా? అలాగే ముఖ్యమంత్రి మీద కూడా రాష్ట్ర స్థాయిలో కేసులు పెట్టడం తేలిక కాదు. కాకపోతే న్యాయ వ్యవస్థను అడ్డు పెట్టుకుని కేంద్రం లోని అధికార పార్టీ తమ వ్యతిరేక పార్టీల సీఎం లను ఇబ్బంది పెట్టే అవకాశం ఉండవచ్చు.

మరో ఉదాహరణ చూద్దాం. దశాబ్దాల కిందట కేంద్రం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తెచ్చింది. అయినా దాని అమలు ఎలా ఉందో చూస్తూనే ఉన్నాం. ఇదే మోడీ ప్రభుత్వం ఇందులో ద్వంద ప్రమాణాలు పాటించడం లేదా? సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్ జేడీ(యూ) పార్టీకి దూరం అయ్యారు. ఆ క్రమంలో ఆయనపై అనర్హత వేటు వేయాలని నితీష్ కుమార్ నాయకత్వంలోని జేడీ(యూ) కోరింది. దానిని ఆఘమేఘాల మీద ఆమోదించి అనర్హత వేటు వేసేశారు. తమ ఎంపీ రఘురామ కృష్ణంరాజు ఉల్లంఘనలకు పాల్పడ్డారని, ఆయనను అనర్హుడిని చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ లోక్‌సభ స్పీకర్ ను కోరింది. మొత్తం టర్మ్ పూర్తయ్యింది కాని, ఆ పిటిషన్‌ను తేల్చలేదు. ఇంకా పలు ఉదాహరణలు ఇలాంటివి ఉన్నాయి. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? 201419 మధ్యకాలంలో ఏపీలో అధికార తెలుగుదేశం పార్టీ 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను లాక్కోవడమే కాకుండా, వారిలో నలుగురికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టింది. అయినా ఆనాటి స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఒక్కరిపై కూడా చర్య తీసుకోలేదు. ఇప్పుడు తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పది మంది కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ అటు శాసన వ్యవస్థలోను, ఇటు న్యాయ వ్యవస్థలోను పోరాడుతోంది. ఇంతవరకు అదేమీ తేలలేదు. అలాగే అంతకుముందు టర్మ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పలువురు బీఆర్ఎస్‌లోకి ఫిరాయించారు. వారిపై అప్పటి స్పీకర్ చర్య తీసుకోలేదు. పైగా వారంతా బీఆర్ఎస్‌లో విలీనమైనట్లు ప్రకటించారు. కేంద్రంలోను, వివిధ రాష్ట్రాలలోను పరిస్థితులు ఇలాఉంటే ఇప్పుడు కేంద్రం తీసుకువస్తున్న ఈ కొత్త చట్టం ఎలాంటి దుష్పరిణామాలకు దారి తీస్తుందా అన్న భయం అందరిలో ఉంది.

# ఉత్పత్తుల్లో మనదేశీయుల చెమట చిందాలి

అహ్మదాబాద్/న్యూఢిలీ, ఈ కబురు: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనదేశంపై విధించిన 25% అదనపు సుంకాల అమలుకు ఒకరోజు ముందు ప్రధాని మోదీ 'స్వదేశీ ఉత్పత్తుల' ఆవశ్యకతను నొక్కి చెప్పారు. స్వదేశీ, మేక్ ఇండి యా అనేవి కొత్త కొలువులు సృష్టించేందుకు సహాయపడతాయని పేర్కొన్నారు. పెట్టుబడులు ఎక్కడి నుంచి వచ్చినా ఉత్పత్తి మాత్రం మనదేశంలోనే జరగాలని స్పష్టం చేస్తూ.. స్వదేశీ అనేది ప్రతి ఒక్కరి జీవిత మంత్రంగా ఉండాలని పిలుపునిచ్చారు. రానున్న ఐదారేళ్లలో జపాన్ సంస్థ సుజుకి మోటర్ కార్పొరేషన్ భారత్‌లో రూ.70వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించిన సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని హన్సల్‌పూర్ కర్మాగారంలో విదేశాల ఎగుమతుల కోసం 'విటారా' అనే ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ నుంచి తయారైన మొట్టమొదటి వాహనాన్ని మోదీ మంగళవారం ఇక్కడ జెండా ఊపి ఎగుమతులను లాంఛనంగా ప్రారంభించారు. అలాగే ఈవీల్లో కీలకమైన లీథియంఅయాన్ బ్యాటరీ, సెల్, ఎలక్ట్రోడ్ ఉత్పత్తుల ఫ్యాక్టరీని కూడా మోదీ ప్రారంభించారు. కాగా, ప్రధాని మోదీ రెండ్రోజుల పర్యటన నిమిత్తం గురువారం (28న) జపాన్ బయల్దేరనున్నారు. 29, 30 తేదీల్లో ఆ దేశ ప్రధాని షిగెరు ఇషిబాతో కీలక చర్చలు జరుపనున్నారు. 15వ భారత్‌జపాన్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఇషిబాతో మోదీ సమావేశం కానుండడం ఇదే మొదటిసారి. 2014లో ఆయన ప్రధానిగా పగ్గాలు స్వీకరించాక జపాన్ వెళ్లడం ఇది ఎనిమిదో సారని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మంగళవారం తెలిపారు. 'అటు నుంచి అటే చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సుకు వెళ్తారు. 31, 1 తేదీ ల్లో అక్కడే ఉంటారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో వేర్వేరుగా ము ఖాముఖి భేటీలు నిర్వహిస్తారు' అని ఆయన తెలిపారు.



# సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితాల ప్రచురణ


ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి... రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సన్నాహాలు వేగవంతం చేసింది. ఎన్నికలకు సన్నద్ధం కావడంలో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందుకు అనుగుణంగా జాబితాలను సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారులను (డీపీవో) ఆదేశిస్తూ మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని నోటిఫికేషన్ జారీచేశారు. 2025 జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాలను తు.చ. తప్పకుండా అనుసరిస్తూ వార్డుల విభజన చేస్తూ తామిచ్చిన షెడ్యూల్‌ను అనుసరించాలని స్పష్టం చేశారు. డీపీవోలతో పాటు అదనపు జిల్లా ఎన్నికల అధికారులు, ఎంపీడీవోలు, సహాయ జిల్లా ఎన్నికల అధికారులు, సీఈవోలు, అదనపు జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లకు (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు మినహా), పీఆర్ ఆర్‌డీ డైరెక్టర్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శికి దీని ప్రతులను పంపించారు.

ఎస్ఈసీ జారీచేసిన షెడ్యూల్...

గురువారం (ఆగస్ట్ 28న) గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితాను రూపొందించి గ్రామపంచాయతీలు, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించాలి.

శుక్రవారం (29న) జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీలప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారుల (జిల్లా కలెక్టర్లు) సమావేశం శనివారం (30న) మండల స్థాయిలో సంబంధిత ఎంపీడీవోల ఆధ్వర్యంలో రాజకీయ పారోటల ప్రతినిధుల సమావేశం గురువారం నుంచి శనివారం దాకా (28 నుంచి 30వ తేదీ వరకు) గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల రీఅరేంజ్‌మెంట్‌కు (వార్డుల వారీగా గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా) సంబంధించి అభ్యంతరాల స్వీకరణ

ఆదివారం (31న) ఈ అభ్యంతరాలపై డీపీవోల ద్వారా పరిష్కారం సెప్టెంబర్ 2న గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాలను డీపీవోల ద్వారా ప్రచురణ.



మొదటి పేజీ తరువాయి

# సాదా బైనామాకు సై



## క్రమబద్ధీకరణకు తొలగిన అడ్డంకి
## మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసిన హైకోర్టు
## కొత్తచట్టం నేపథ్యంలో పిల్‌పై విచారణ మూసివేత

ఈ కబురు, హైదరాబాద్: సాదా బైనామాల క్రమబద్ధీకరణకు గత కొన్నేళ్లుగా ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. క్రమబద్ధీకరణ కోసం 2020 అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 112 అమలును నిలిపివేస్తూ.. 2020 నవంబరులో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు మంగళవారం ఎత్తివేసింది. ఆర్వోఆర్ చట్టం 1971 రద్దయి.. కొత్తగా భూభారతి చట్టం అమల్లోకి వచ్చినందున.. పాత చట్టంపై దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించడం వ్యర్థప్రయత్నమని పేర్కొంది. జీవో 112ను సవాలు చేస్తూ నిర్మల్ జిల్లాకు చెందిన షిండే దేవిదాస్ ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. అప్పట్లో విచారించిన హైకోర్టు.. ధరణి చట్టంలో నిబంధన లేకుండా క్రమబద్ధీకరణ చేపట్టడం సరికాదంటూ 2020 నవంబరు 11న స్టే ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని ఎత్తివేసి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని ప్రస్తుత ప్రభుత్వం మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 2014కు ముందు 12 ఏళ్లుగా సాదా బైనామాల కింద కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 2020లో ప్రభుత్వం విధించిన గడువులోగా తొమ్మిది లక్షలకు పైగా దరఖాస్తులు అందాయన్నారు. ప్రస్తుతం కొత్తగా భూభారతి చట్టం తీసుకువచ్చామని, ఇందులో సెక్షన్ 6 ప్రకారం.. 2014కు ముందు 12 ఏళ్లపాటు భూమి స్వాధీనంలో ఉన్నవారికి క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది జె.ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. కొత్తచట్టంలోని నిబంధనను కూడా సవాలు చేస్తూ సవరణ పిటిషన్ దాఖలు చేశామని, దీనిపై వాదనలు వినిపించడానికి అనుమతించాలన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. కొత్త చట్టం వచ్చిన నేపథ్యంలో తాజాగా ఎందుకు పిటిషన్ వేయరని ప్రశ్నించింది. గతంలో పలుమార్లు వాయిదా తీసుకుని ఇప్పుడు సవరణ పిటిషన్ అంటున్నారని.. దీనివల్ల ప్రక్రియ మరింత జాప్యమవుతుందని పేర్కొంది. న్యాయవాది వాదనలు కొనసాగిస్తూ.. కొత్త చట్టంలో కూడా పాత దరఖాస్తులను మాత్రమే అనుమతిస్తున్నారని, కొత్త వాటిని స్వీకరించకపోవడం వివక్ష చూపడమేనన్నారు. కొత్త పిటిషన్ దాఖలు చేస్తామని, అయితే వారం రోజులపాటు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేయకుండా ఆదేశాలివ్వాలని కోరారు. తగిన కారణాలున్నాయని పిటిషనర్ భావిస్తే కొత్త పిటిషన్ వేసుకోవచ్చని.. గత పిటిషన్‌లోని అంశాలతో సంబంధం లేకుండా కొత్త అంశాలతో దాఖలు చేసిన సవరణ పిటిషన్‌ను అనుమతించలేమని ధర్మాసనం తెలిపింది. ప్రభుత్వం కొత్త చట్టం తీసుకువచ్చినందున.. సన్న, మధ్యతరగతి రైతులకు చెందిన సాదా బైనామాల క్రమబద్ధీకరణకు గత మధ్యంతర ఉత్తర్వులు అడ్డంకిగా ఉన్న నేపథ్యంలో వాటిని ఎత్తివేస్తున్నామని ప్రకటించింది.

# దొంగ ఓట్లంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం.. ప్రజల్ని అవమానించడమే: బండి సంజయ్

ఈ కబురు,కరీంనగర్: ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ''దొంగ ఓట్లు అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు వేయడం ఎవరికైనా సాధ్యమా?అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రొహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు బ్యాంకు ముఖ్యమా ?అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయి'' అని బండి సంజయ్ విమర్శించారు.

మొదటి పేజీ తరువాయి

# మోడీ, పుతిన్, జిన్‌పింగ్ భేటీ?.. యూఎస్ సుంకాల టైంలో కీలక నిర్ణయం!



ఈ కబురు: యూఎస్ సుంకాల బెదిరింపుల నేపథ్యంలో చైనా కీలక నిర్ణయం తీసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధాని నరేంద్ర మోడీని చైనాకు ఆహ్వానించేందుకు జీ జిన్‌పింగ్ రెడీ అవుతున్నట్లు సమాచారం. టియాంజియాన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సమావేశానికి వీరితో పాటు దక్షిణాసియా, మిడిల్ ఈస్ట్, ఆగ్నేయాసియా దేశాల నేతలను కూడా చైనాకు జిన్‌పింగ్ ఆహ్వానిస్తారట. ప్రపంచంలో కొత్త ఆర్డర్ వస్తోందనే సంకేతాన్ని యూఎస్‌కు పంపేందుకు ఈ అవకాశాన్ని చైనా ఉపయోగించుకుంటుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.తద్వారా చైనా, ఇరాన్, రష్యా, ఇండియాను కట్టడి చేసేందుకు యూఎస్ చేస్తున్న ప్రయత్నాలు విఫలమయ్యాయనే సందేశాన్ని ఎస్‌సీవో మీటింగ్ ఇస్తుందని వారి అభిప్రాయం. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 1 వరకు ఎస్‌సీవో మీటింగ్ జరగనుంది. యూఎస్ విధానాలకు వ్యతిరేకంగా దేశాలు కలిసి రావడంతోపాటు ప్రపంచానికి మరో దిశను చూపించేలా ఈ సమావేశం ఉండబోతోందని చైనా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బ్రిక్స్ కూటమి సమావేశం తర్వాత ట్రంప్ టెన్షన్ ఎక్కువైందని, ఇప్పుడు ఎస్‌సీవో సమావేశంతో యూఎస్ టెన్షన్స్ మరింత పెరుగుతాయని నిపుణుల అభిప్రాయం.

# ఉదయగిరి, హిమగిరి.. దేశ రక్షణ గిరి

ఈ కబురు: భారత నౌకాదళానికి చెందిన నీలగిరి శ్రేణి స్టెల్త్ ఫ్రిగేట్లు ఐఎన్ఎస్ ఉదయగిరి , ఐఎన్ఎస్ హిమగిరి నేడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విశాఖపట్టణంలో జరిగిన కార్యక్రమంలో విధుల్లోకి ప్రవేశపెట్టారు. ప్రాజెక్టు 17 ఆల్ఫా కింద వీటిని పూర్తిగా దేశీయంగానే నిర్మించారు. సముద్ర రక్షణలో ఇవి భారత నౌకాదళంలో కీలకం కానున్నాయి. అద్భుతమైన ఎలక్ట్రానిక్ వార్ఫేర్ వ్యవస్థలు వీటి సొంతం.రెండు వేర్వేరు షిప్ యార్డుల్లో నిర్మించిన నిర్మించిన యుద్ధ నౌకలు ఏకకాలంలో కమిషన్ చేయడం దేశంలో ఇదే తొలిసారి. ప్రాజెక్టు 17ఏ (ఆల్ఫా) కింద నిర్మించిన తొలి నౌక ఐఎన్ఎస్ నీలగిరిని ఈ ఏడాది ప్రధాని నరేంద్ర మోదీ కమిషన్ చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టులో రెండో నౌక ఐఎన్ఎస్ ఉదయగిరి. దీనిని ముంబయిలోని మాజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మించింది. ఇక ఐఎన్ఎస్ హిమగిరి ని కోల్‌కతాలోని గార్డెన్ రిచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) తయారు చేసింది. భారత నౌకదళానికి చెందిన 'వార్‌షిప్ డిజైన్ బ్యూరో' డిజైన్ చేసిన 100వ నౌకగా ఐఎన్ఎస్ ఉదయగిరి నిలిచింది. భారత్‌లో నిర్మాణం కోసం ఏర్పాటైన దాదాపు 200 సూక్ష్మ, చిన్న, మధ్యపరిశ్రమల సాయంతో వీటి నిర్మాణం జరిగింది. ప్రత్యక్షంగా 4,000 మందికి, పరోక్షంగా 10,000 మందికి ఉపాధి లభించిందని రక్షణ శాఖ వెల్లడించింది. నీలగిరి శ్రేణిలో ఏడు గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్లను నిర్మిస్తున్నారు. ఇవి ప్రాజెక్ట్17లో నిర్మించిన శివాలిక్ శ్రేణి యుద్ధ నౌకలకు కొనసాగింపుగా



ఉంటాయి. నీలగిరి, ఉదయగిరి , తారగిరి, మహేంద్ర గిరి యుద్ధ నౌకలను ఎండీఎల్, హిమగిరి , దునాగిరి, వింధ్యాగిరిలను జీఆర్ఎస్ఈ నిర్మిస్తున్నాయి. వీటి కోసం 75శాతం భారతీయ పరికరాలు, మెటీరియల్‌నే వినియోగిస్తున్నారు. గతంలో వాడిని లియాండర్ శ్రేణి యుద్ధనౌకలకు నీలగిరి శ్రేణివి అప్‌డేట్ వెర్షన్‌గా అభివర్ణించవచ్చు.

**ఘన చరిత్ర కొనసాగింపు..**

ఆంధ్ర ప్రదేశ్‌లో నెల్లూరు జిల్లాలోని పర్వత ప్రాంతమైన ఉదయగిరి పేరును వీటిల్లోని ఒక దానికి పెట్టారు. ఇదే పేరుతో 1976లో కమిషన్ అయిన ఒక నౌక ఉంది. అప్పట్లో దానిని శ్రీలంకలో ఆపరేషన్ పవన్, ఆపరేషన్ కాస్టోర్, ఆపరేషన్ డాల్ఫిన్, ఆపరేషన్ కాక్టస్, ఆపరేషన్ మదాద్‌లో వినియోగించారు. 2007లో ఆ నౌకకు విశ్రాంతి ప్రకటించారు. ఇప్పుడు అదే పేరుతో కొత్త నౌకను ప్రవేశపెట్టారు.

1974లో ఐఎన్ఎస్ హిమగిరి పేరిట తొలిసారి యుద్ధ నౌకను నేవీకి అందించారు. వెస్ట్రన్ నేవల్ కమాండ్‌లో ఇది సేవలు అందించింది. ఆపరేషన్ కాక్టస్‌లో పాల్గొంది. బాంబే హై చమురు క్షేత్రం రక్షణ బాధ్యతలను చూసుకొంది. గుజరాత్ భూకంపం సమయంలో ఆపరేషన్ సహాయతలో పాల్గొంది. 2005లో దీనిని డికమిషన్ చేశారు. ఇప్పుడు అదే పేరుతో మరోదానిని తీసుకొచ్చారు. నౌకాదళంలో సన్‌రైజ్ ఫ్లీట్‌గా పిలిచే ఈస్ట్రన్ నేవల్ కమాండ్‌లో ఉదయగిరి భాగమైంది. దీని కమాండింగ్ ఆఫీసర్‌గా వికాస్ సూద్ వ్యవహరించనున్నారు. ఆయన తండ్రి మొదటి ఉదయగిరి నౌకలో సేవలు అందించడం విశేషం.

# పాక్ గూఢచారి మోతీరామ్‌కు భారీ నెట్‌వర్క్..!




ఈ కబురు: పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారం చేరవేస్తూ దొరికిపోయిన సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మోతీరామ్‌కు పెద్దసంఖ్యలో మన సైన్యం, పారామిలటరీ, ప్రభుత్వ అధికారులతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అతడి ఫోన్‌లో 15 మంది నంబర్లను దర్యాప్తు బృందం గుర్తించిందని ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. వీరిలో నలుగురు ఆర్మీ, నలుగురు పారామిలటరీ సిబ్బంది కాగా.. మిగిలినవారు ప్రభుత్వ అధికారులుగా తేలారు. జాట్‌ను మే 27న ఎన్ఐఏ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తు బృందాలు ప్రస్తుతం అతని ఫోన్‌ను విశ్లేషిస్తున్నాయి. దీనినుంచి అతడు ఇంటర్నెట్ కాల్స్ కూడా చేసినట్లు తెలుస్తోంది. అతడు పాకిస్థాన్‌లో సలీం అనే ఆపరేటివ్‌తో టచ్‌లో ఉన్నాడు. అతను మాట్లాడేందుకు వాడే ఫోన్‌లోని సిమ్‌కార్డ్‌ను కోల్‌కతా నుంచి ఓ వ్యక్తి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దాని యాక్టివేషన్ ఓటీపీని కూడా అతడు లాహోర్‌లోని పాక్ ఆపరేటివ్‌తో పంచుకొన్నాడు. సదరు కోల్‌కతా వ్యక్తి పాక్ జాతీయురాలిని పెళ్లి చేసుకొన్నాడు. ఆ తర్వాత అక్కడికి వెళ్లి స్థిరపడ్డాడు. ఏటా రెండుసార్లు కోల్‌కతా వెళ్లి వస్తుంటాడని గుర్తించారు. ఇక మోతీరామ్ నుంచి అత్యంత సున్నితమైన సమాచార పత్రాలను సదరు లాహోర్ ఆపరేటివ్ తెప్పించుకొన్నాడు. ఇందుకోసం అత్యధికంగా రూ.12,000 వరకు చెల్లించేవాడు. అయితే లావాదేవీల్లో ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు ఇలా వ్యవహరించినట్టు తేలింది. ఒక్కసారిగా పెద్దమొత్తంలో పంపకుండా విడతలవారీగా అందుకునేవాడు. ఆ డబ్బు భారత్‌లోని దిల్లీ, మహారాష్ట్ర, హరియాణ, యూపీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, వెస్ట్‌బెంగాల్‌లోని వివిధ ఖాతాల నుంచి జమయ్యేవి.

ఈ నగదు పంపించే వారిలో ఒకరి పేరు షెహజాద్‌గా గుర్తించారు. అతడిని యూపీ పోలీసులు మే లోనే అరెస్టు చేశారు. అతడు పాకిస్థాన్ నుంచి దుస్తులు, సుగంధ ద్రవ్యాలు, కాస్మోటిక్స్ స్మగ్లింగ్ చేసి విక్రయించేవాడు. అయితే షెహజాద్ వాదన భిన్నంగా ఉంది. తాను రైల్లో దిల్లీ నుంచి పంజాబ్ వెళుతున్న సమయంలో తోటి ప్రయాణికుడు ఒకరు జాట్ నెంబర్‌కు రూ.3,500 పంపాల్సిందిగా కోరి.. తనకు ఆ మొత్తాన్ని నగదు రూపంలో ఇచ్చాడని చెబుతున్నాడు.

# నేను ఆ కార్డ్స్ ఆడితే.. చైనాకు వినాశనమే: ట్రంప్ వార్నింగ్

ఈ కబురు,వాషింగ్టన్: చైనాతో వాణిజ్యయుద్ధం గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజింగ్‌తో తాము గొప్ప సంబంధాలు కొనసాగించాలనుకుంటున్నట్లు తెలిపారు. అయితే, చైనా కంటే తమ ఆధిపత్యమే ఎక్కువన్నారు. ఈవిషయంలో పోటీకొస్తే బీజింగ్‌కు వినాశనం తప్పదని ట్రంప్ పరోక్షంగా హెచ్చరించారు.''ఈ ఏడాది చివర్లో లేదా ఆ తర్వాత కొంతకాలానికి నేను చైనా పర్యటనకు వెళ్తా. ఇరుదేశాల మధ్య అద్భుత సంబంధాలు ఉండబోతున్నాయి. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న వాణిజ్య విభేదాల్లో బీజింగ్ కంటే వాషింగ్టన్ బలంగా ఉంది. వాళ్ల (చైనాను ఉద్దేశిస్తూ) వద్ద కొన్ని కార్డులు ఉన్నాయి. మా వద్ద అంతకంటే అద్భుతమైన కార్డులు ఉన్నాయి. కానీ, వాటితో నేను ఆడాలనుకోవట్లేదు. ఒకవేళ ఆడితే చైనా నాశనం అవుతుంది. అందుకే ప్రస్తుతానికి ఆ కార్డులు నేను ఆడను'' అని ట్రంప్ వెల్లడించారు.ఆటోమొబైల్, రక్షణ రంగానికి అవసరమైన మ్యాగ్నెట్స్ సరఫరాను చైనా కొనసాగించాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు స్పష్టం చేశారు. ''ఆ మ్యాగ్నెట్‌స్‌ను మాకు ఇవ్వాల్సిందే. లేదంటే వారిపై 200శాతం టారిఫ్‌లు విధిస్తాం. దానివల్ల మాకు ఎలాంటి సమస్యా రాదు'' అని ట్రంప్ హెచ్చరించారు.

**కిమ్‌తో భేటీ అవుతా..**

మరోవైపు, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్‌తో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మ్యూంగ్ మాట్లాడుతూ.. ''కొరియా ద్వీపకల్పంలో మీరు (ట్రంప్) శాంతిని పునరుద్ధరించగలరని విశ్వసిస్తున్నా. అప్పుడు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోన్ ఉన్‌తో మీరు భేటీ అవ్వొచ్చు'' అని అన్నారు. దీనికి ట్రంప్ బదులిస్తూ.. కిమ్‌తో భేటీకి తాను కూడా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాదిలోనే ఆ సమావేశం జరుగుతుందని ఆకాంక్షించారు. అందరికంటే కిమ్ గురించి తనకే ఎక్కువ తెలుసని అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. గతంలో ఉత్తరకొరియా అధినేతతో ట్రంప్ మూడుసార్లు భేటీ అయిన సంగతి తెలిసిందే.అమెరికా టెక్ కంపెనీలు మీ పిగ్గీ బ్యాంక్‌లు కాదు..అమెరికా టెక్ కంపెనీలపై పలు దేశాలు విధిస్తున్న డిజిటల్ పన్నులపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈమేరకు తన ట్రూత్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ చేశారు. ''అమెరికా అధ్యక్షుడిగా మా టెక్ కంపెనీలపై పన్నుల రూపంలో జరుగుతున్న దాడులకు ఎదురునిలబడతా. డిజిటల్ పన్నులు, డిజిటల్ సర్వీసెస్ చట్టాలు, డిజిటల్ మార్కెట్ రెగ్యులేషన్స్ ఇలాంటి అమెరికా టెక్నాలజీకి హాని చేసేందుకు ఉద్దేశించినవే. చైనా కంపెనీలపై ఎలాంటి పన్నులు వేయకుండా వివక్షపూరితంగా అగ్రరాజ్య సంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇది ఆగాలి. లేదంటే ఆయా దేశాలపై అదనపు టారిఫ్‌లు తప్పవు. మా సంస్థలు మీకు పిగ్గీ బ్యాంకులు కావు. అమెరికాను, మా టెక్ కంపెనీలను గౌరవించండి. లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి'' అని ట్రంప్ హెచ్చరించారు.



# యూరియా కోసం రైతుల అవస్థలు

హైదరాబాద్, ఈ కబురు: రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర అవస్థలు పడుతుంటే.. ముఖ్యమంత్రి, మంత్రులు ఎక్కడ ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఎక్కడ ఎన్నికలుంటే అక్కడికి ఎగిరిపోతారా? సమస్య లు ఇక్కడ ఉంటే, సీఎం, మంత్రులు ఢిల్లీ, బిహార్‌లోనా అని మంగళవారం ఎక్స్‌లో నిలదీశారు. రైతుల కష్టాలపై దృష్టి పెట్టకుండా, రాష్ట్ర సమస్యలను గాలికొదిలేసి జాతీయ రాజకీయాల కోసం అంతా ఢిల్లీ, బిహార్‌కు వెళ్లారని మండిపడ్డారు. జాతీయ పార్టీలకు ఓట్లు తప్ప.. రాష్ట్ర ప్రజల పాట్లు పట్టవని, యూరియా సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని ఆరోపించారు.



# వచ్చే ఐదేళ్లలో భారత్‌లో రూ 70000 కోట్ల పెట్టుబడులు

ఈ కబురు: భారత్‌లో సంస్థ కార్యకలాపాలు పటిష్ఠం చేయడంపై జపాన్‌కు చెందిన సుజుకీ మోటార్ కార్పొరేషన్ దృష్టి సారించింది. వచ్చే ఐదారేళ్ల కాలంలో ఇందుకోసం రూ.70,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ కారు ఈవిటారా ఎగుమతులను, లిథియం అయాన్ బ్యాటరీ సెల్స్ తయారీ విభాగాన్ని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో సుజుకీ మోటార్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ మాట్లాడుతూ.. తమ పెట్టుబడి ప్రణాళికలను వివరించారు. గత నాలుగు దశాబ్దాలుగా భారత మొబిలిటీ యానంలో సుజుకీ చురుకైన భాగస్వామిగా ఉన్నదని, పర్యావరణహితమైన హరిత మొబిలిటీని ప్రోత్సహించాలన్న భారత్ విజన్‌కు మద్దతుగా నిలుస్తుందని అన్నారు. ఏడాదికి 40 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యం సాధించడం, అందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, ఆర్ అండ్ డీ ఏర్పాటు, కొత్త టెక్నాలజీలపై ఈ పెట్టుబడులుంటాయని మారుతి సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్‌సీ భార్గవ చెప్పారు. రూ.35,000 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్టు గత ఏడాది ప్రకటించిన రెండో ప్లాంట్ నిర్మాణం గురించిన ప్రశ్నకు స్పందిస్తూ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం అనంతరం దానికి తాను సమాధానం చెప్పగలుగుతానన్నారు. మారుతి సుజుకీ ఇండియా భాగస్వామిగా ఉన్న సుజుకీ గ్రూప్ ఇప్పటికే దేశంలో రూ.లక్ష కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈ పెట్టుబడితో అందుకు సంబంధించిన విభాగాల్లో 11 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయని భార్గవ అన్నారు. ఈవిటారా ఎగుమతి మార్కెట్ల కోసం తయారు చేస్తున్నామని, దేశీయ మార్కెట్లో దాన్ని విడుదల చేయడానికి నిర్దిష్ట కాలపరిమితి ఏదీ పెట్టుకోలేదని ఆయన వెల్లడించారు. ఆ కారును దేశీయ మార్కెట్లో విడుదల చేయకపోవడానికి ఎగుమతి కట్టుబాట్లతో పాటు ధర కూడా ప్రధానమని చెప్పారు. బ్యాటరీల దిగుమతి కారణంగా దేశంలో ఈవీల ధరలు అధికంగా ఉన్నాయన్నారు. గుజరాత్ ప్లాంట్‌లో తయారైన మేడ్ ఇన్ ఇండియా ఈవిటారాను జపాన్, యూరప్ సహా 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ఆయన చెప్పారు. 10 లక్షల కార్ల తయారీ లక్ష్యంతో ఈ యూనిట్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆటోమొబైల్ తయారీ హబ్ కానుందని ఆయన వెల్లడించారు. కాగా దేశంలో తొలి లిథియం అయాన్ బ్యాటరీ తయారీ యూనిట్ ప్రారంభించడాన్ని ఒక మైలురాయిగా సుజుకీ అభివర్ణించారు



# స్థానిక ఎన్నికలపై డైలమా!

ఈ కబురు, హైదరాబాద్/న్యూఢిల్లీ: రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికల విషయంలో డైలమా ఏర్పడింది. వాయిదా వేద్దామా? ప్రభుత్వ పరంగా బీసీలకు 42% కోటాపై జీవో ఇచ్చి ముందుకు వెళదామా అన్న దానిపై అధికార కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడుతోంది. ఈ అంశంపై జాతీయ స్థాయి న్యాయ నిపుణులతో పాటు పార్టీ హైకమాండ్‌తో కూడా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం చర్చలు జరిపినప్పటికీ ఇంకా స్పష్టత రాలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీసీసీ నియమించిన మంత్రుల బృందం ఇచ్చే నివేదిక కీలకం కానుంది. మంత్రుల బృందం చేసే సిఫారసును ఈ నెల 30వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మరోసారి కూలంకషంగా చర్చించిన తర్వాతే దీనిపై ఓ స్పష్టత వస్తుందని ప్రభుత్వ, కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎటూతేల్చుకోలేక..!: పంచాయతీ ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశం ఎంతకీ తేలకపోవడం ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి సమస్యగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మెజారిటీ మంత్రులు ఎన్నికలకు వెళ్దాం అనే ఆలోచనలో ఉన్నారు. కానీ పార్టీలోని బీసీ నాయకత్వం రిజర్వేషన్ల కల్పనపై మాట నిలబెట్టుకుని ఎన్నికలకు వెళ్తే బాగుంటుందని సూచిస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మొదటి నుంచి 42% రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలనే ఆలోచనతో ఉన్నారు. ఈ తర్జనభర్జనల నేపథ్యంలోనే న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ నిర్ణయించింది. అందులో భాగంగానే రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పీసీసీ నియమించిన ఐదుగురు మంత్రుల బృందం ఢిల్లీలో పర్యటించి న్యాయ నిపుణులతో పాటు పార్టీ హైకమాండ్‌తో కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించినట్టు తెలుస్తోంది. పార్టీ పరంగా ఇస్తే బూమరాంగ్ ఖాయం విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. కులగణన చేస్తామని, ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రజలకు వాగ్దానం చేసి, ఇప్పుడు పార్టీ పరంగా ఇస్తామని చెబితే బూమరాంగ్ కావడం ఖాయమని కాంగ్రెస్ హైకమాండ్ తేల్చిచెప్పింది. అవసరమైతే ఎన్నికల నిర్వహణకు కోర్టును మరింత సమయం కోరాలని సూచించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి పంపిన రెండు బిల్లులతో పాటు, 50% రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడాన్ని తప్పుపడుతూ.. క్షేత్రస్థాయిలో బీజేపీని ఎండగట్టే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పినట్లు తెలిసింది. సోమవారం ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల



ఇన్‌చార్జ్ కేసీ వేణుగోపాల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీలతో చర్చలు జరిపిన సీఎం, మంత్రుల బృందం.. మంగళవారం బిహార్‌లో ఓటర్ అధికార యాత్ర నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీతోనూ సమాలోచనలు జరిపినట్లు తెలిసింది. 'పార్టీ పరంగా సాధ్యం కాదు. ఒకవేళ ఇచ్చినా మళ్లీ గత అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితే రావొచ్చు. ఓడిపోయే సీట్లను బీసీలకు కేటాయించొచ్చు. ఇది బీసీలను మోసం చేయడమే..' అని కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. 'బీసీలకు రిజర్వేషన్ల అమలు ఇప్పుడు ఒక్క తెలంగాణ అంశమే కాదు.. యావత్ దేశానిది. రిజర్వేషన్లు అమలు చేయకుండా ఒకట్రెండు ధర్నాలు చేసి చేతులు ముడుచుకుంటే మొదటికే మోసం వస్తుంది. కాబట్టి బీజేపీని మరింతగా ఎండగట్టాలి. బీసీ రిజర్వేషన్లపై కేంద్రం తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి..' అని హైకమాండ్ పెద్దలు గట్టిగా చెప్పినట్లు తెలిసింది.ఈ పరిస్థితుల్లోనే ప్రభుత్వ పరంగా బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే అంశం తెరపైకి వచ్చింది. అయితే ఇది కోర్టులో నిలబడుతుందా లేదా? అనే సందేహం కూడా కాంగ్రెస్ నేతలను వెంటాడుతోంది. కోర్టును గడువు అడగండి..మళ్లీ ఆర్డినెన్స్ పంపండి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో న్యాయ కోవిదుల అభిప్రాయాలను తీసుకుని నివేదిక సమర్పించేందుకు గాను టీపీసీసీ నియమించిన మంత్రుల బృందం ఆదివారం ప్రజాభవన్‌లో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డితో సమావేశమై ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలు, న్యాయపరంగా ఉన్న ఇబ్బందులపై చర్చించింది. తాజాగా సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో సమావేశమైంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఆలోచనలను కూడా వివరించింది. ఈ నేపథ్యంలో 42 శాతం రిజర్వేషన్లను అధికారికంగా అమలు చేయాలనే కోణంలోనే ముందుకు వెళ్లాలనుకుంటే ఎన్నికలను మూడు నెలల పాటు వాయిదా వేయాలని సూచించినట్టు తెలిసింది. అదే విధంగా 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ తెచ్చిన ఆర్డినెన్స్ కాలపరిమితి 3 నెలలు ముగిసిన తర్వాత మళ్లీ ఆర్డినెన్స్ చేసి, మరోమారు ఆమోదం కోసం గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపాలని చెప్పినట్లు సమాచారం. ఈలోపు హైకోర్టులో ఉన్న కేసులో ఆరు వారాల గడువు కోరుతూ కౌంటర్ దాఖలు చేయాలని, తద్వారా సుప్రీంకోర్టులో ఉన్న కేసుకు బలం చేకూరుతుందని, రెండోసారి మంత్రివర్గం పంపిన ఆర్డినెన్స్‌ను రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు ఆమోదించాల్సి ఉంటుందని ఆయన వివరించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అసెంబ్లీ సమావేశాల నిర్ణయంపై చర్చ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అవుతోంది. అసెంబ్లీ నిర్వహణకు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధం లేనప్పటికీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండటం సాధ్యం కాదనే కోణంలోనే వీలున్నంత త్వరగా అసెంబ్లీ సమావేశాలను పూర్తి చేయాలన్న యోచనతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అంటున్నారు. ఇదే నిజమైతే 30వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో విడుదల చేయాలని మంత్రివర్గం నిర్ణయిస్తుందని తెలుస్తోంది. ఒకవేళ ఎన్నికల వాయిదాకు కనుక మొగ్గు చూపితే హైకోర్టును గడువు అడిగే విధంగా కేబినెట్ నిర్ణయం ఉంటుందని సమాచారం ఏది ఏమైనా ఈ నెల 30వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ భేటీలో..అన్ని అంశాలను క్రోడీకరించి మంత్రుల బృందం ఇచ్చే సిఫారసుపై చర్చించిన అనంతరమే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయా? వాయిదా పడతాయా? అన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. రాహుల్ యాత్రలో సీఎం, రాష్ట్ర నేతలు కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతోందంటూ బిహార్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రాహుల్‌తో కలిసి రేవంత్‌రెడ్డి రోడ్‌షోలో పాల్గొన్నారు. రోడ్‌షోకు హాజరైన పార్టీ నేత ప్రియాంకగాంధీని కూడా రాష్ట్ర నేతలు కలిశారు.

# ‘ఆండ్రాయిడ్’కి మరింత రక్షణ.. యాప్‌ల సైడ్ లోడింగ్ కుదరదు!

ఆండ్రాయిడ్ వినియోగదారుల రక్షణ కోసం గూగుల్ మరింత భద్రతాపరమైన చర్యలు చేపట్టబోతోంది. ఈ మేరకు డెవలపర్ వెరిఫికేషన్ ప్రోగ్రాంలో కొత్త అంశాలను జోడించనుంది. వచ్చే ఏడాది నుంచి ఆండ్రాయిడ్ ఫోన్లలో యాప్‌ల సైడ్‌లోడ్ విధానంలో భారీ మార్పులు తీసుకురానున్నట్లు ప్రకటించింది. వెరిఫై కాని డెవలపర్లు రూపొందించిన యాప్‌లను ఆండ్రాయిడ్ డివైజ్‌ల్లో ఇన్‌స్టాల్ చేసుకోవడం పూర్తిగా నిలిపేస్తున్నట్లు స్పష్టం చేసింది.

వెరిఫికేషన్ చేసుకోని డెవలపర్‌లు రూపొందించిన యాప్‌లను ఆండ్రాయిడ్ మొబైల్‌స్‌లో ఇన్‌స్టాల్ చేయకుండా గూగుల్ తగు మార్పులు చేసింది. మాల్‌వేర్ రిస్క్‌లను తగ్గించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది.

ఈ కొత్త గూగుల్ డెవలపర్ ప్రోగ్రామ్ వచ్చే ఏడాది మార్చి నుంచి బ్రెజిల్, సింగపూర్, థాయ్‌లాండ్‌లో అమలు అవుతుంది. 2027 నుంచి ప్రపంచవ్యాప్తంగా దీనిని అమలు చేస్తారు. ప్లేస్టోర్ యాప్‌ల నుంచి ఇన్‌స్టాల్ చేసిన యాప్‌ల కంటే ఇలా సైడ్ లోడింగ్ ద్వారా ఇన్‌స్టాల్ అయిన యాప్‌లకు మాల్‌వేర్ రిస్క్‌లు 50 రెట్లు ఎక్కువగా ఉన్నాయని గూగుల్ తెలిపింది.

అయితే ఈ మార్పుల వెనుక మరో కారణం కూడా ఉందనేది టెక్ వర్గాల మాట. యూఎస్‌లో ఎపిక్ గేమ్స్ యాంటీ ట్రస్ట్ కేసులో గూగుల్‌కు ఇటీవల ఎదురుదెబ్బ తగిలింది. కోర్టు తీర్పు ప్రకారం థర్డ్ పార్టీ యాప్ స్టోర్లను కూడా గూగుల్ తన ప్లే స్టోర్‌లో అనుమతించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో గూగుల్ యాప్‌ల మీద నియంత్రణ కొనసాగించేందుకు కొత్త వెరిఫికేషన్ నిబంధనలను ప్రవేశపెడుతోందని చెప్పొచ్చు.




# సుంకాల ప్రభావం.. ఎదురయ్యే సవాళ్లు: ఆర్‌బీఐ గవర్నర్



**ముంబై:** టారిఫ్ పరమైన అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆర్థిక సవాళ్లను విసురుతున్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ తరుణంలో పెట్టుబడులను ఇతోధికం చేసేందుకు బ్యాంక్‌లు, కార్పొరేట్లు కలసి రావాలని పిలుపునిచ్చారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు.

అమెరికా భారత్ వాణిజ్య ప్రతినిధుల మధ్య కొనసాగుతున్న సంప్రదింపులు అంతిమంగా ఒక నిర్ణయానికి దారితీస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అప్పుడు టారిఫ్‌ల కారణంగా దేశీ ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం పరిమితం అవుతుందన్నారు. భారత ఉత్పత్తులపై అమెరికా 25 శాతం టారిఫ్‌లు విధించగా, ఈ నెల 27 నుంచి మరో 25 శాతం టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. ఈ క్రమంలో టెక్స్‌టైల్స్, రొయ్యలపై అధిక ప్రభావం పడుతుందన్న ఆందోళనల నేపథ్యంలో అవసరమైతే రంగాల వారీ ఆర్థిక చేయూతకు అవకాశం ఉంటుందని మల్హోత్రా సంకేతం ఇచ్చారు.

పరపతి విధానంలో భాగంగా ద్రవ్యోల్బణంతోపాటు వృద్ధి క్రమాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు చెప్పారు. “క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నాం. భౌగోళిక రాజకీయ, టారిఫ్ పరమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. కనుక ఆర్థిక విస్తరణ మార్గాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బ్యాంక్‌లు, కార్పొరేట్ బ్యాలన్స్ షీట్లు మెరుగ్గా ఉన్నాయి. కనుక అవి పరస్పర సహకారంతో పెట్టుబడుల సైకిల్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలి. ఈ కీలక తరుణంలో ఇది ఎంతో అవసరం”అని పేర్కొన్నారు.

**రుణ వృద్ధికి చర్యలు..**

ధరల స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం వృద్ధికి అడ్డుకావని మల్హోత్రా అభిప్రాయపడ్డారు. బ్యాంకుల రుణ వృద్ధి మూడేళ్ల కనిష్ఠానికి తగ్గిన తరుణంలో.. ఇందుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఆర్‌బీఐ నియంత్రణలోని సంస్థల వ్యాపార సులభతర నిర్వహణను పెంచడంపైనా దృష్టి పెట్టినట్టు చెబుతూ, దీనివల్ల వ్యయాలు తగ్గుతాయన్నారు. ఆర్‌బీఐ ఎన్నో వివరాలు కోరుతుందన్న అభిప్రాయాలు నెలకొన్నాయని చెబుతూ.. అడిగిన సమాచారం విషయంలో భాగస్వాములు సహకరించాలని కోరారు. దీనివల్ల మెరుగైన నియంత్రణలకు అవకాశం ఉంటుందన్నారు. త్వరలోనే బాసెల్ 3 నిబంధనలను అమల్లోకి తెస్తామని చెప్పారు. అందరికీ ఆర్థిక సేవలను మరింత విస్తృతం చేయడం, చిన్న వ్యాపారులకూ రుణ సాయం చేరువ చేయడం, కస్టమర్ సేవల నాణ్యతను పెంచడం తమ ప్రాధాన్యతలుగా చెప్పారు.




# వొడాఫోన్ ఐడియాకు ఉపశమనంపై స్పష్టత

**రుణ భారంతో సతమతమవుతున్న మొబైల్ టెలికం రంగ దిగ్గజం వొడాఫోన్ ఐడియాకు ఆర్థిక ఉపశమనాన్ని కలిగించే యోచన చేయడంలేదని టెలికం శాఖ స్పష్టం చేసింది. కంపెనీ స్థూల సర్దుబాటు ఆదాయం(ఏజీఆర్) బకాయిలపై ప్రస్తుతం తమవద్ద ఎలాంటి ప్రణాళికలు లేదా ఆలోచనలు లేవని కమ్యూనికేషన్స్ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

‘ఇటీవల కంపెనీకున్న భారీ రుణ భారాన్ని ఈక్విటీగా మార్పు చేసుకున్నాం. ప్రభుత్వ ఆలోచన ప్రకారం ఇది చేపట్టాం. ప్రభుత్వం చేయదలచినదంతా ఇప్పటికే పూర్తి చేసింది. ప్రస్తుతం వీటిపై ఎలాంటి సమాలోచనలూ చేయడంలేదు’ అంటూ స్పష్టతనిచ్చారు. స్పెక్ట్రమ్ వేలం బకాయిలకుగాను మార్చిలో ప్రభుత్వం రూ. 36,950 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను సొంతం చేసుకోవడం ద్వారా వొడాఫోన్ ఐడియాలో అతిపెద్ద వాటాదారుగా అవతరించిన సంగతి తెలిసిందే. ఇంతక్రితం 2023లోనూ ప్రభుత్వం రూ. 16,000 కోట్ల బకాయిలకుగాను వొడాఫోన్ ఐడియాలో 33 శాతం వాటాను అందుకోవడం గమనార్హం! 2025 జూన్‌కల్లా కంపెనీ ఏజీఆర్ లయబిలిటీ రూ.75,000 కోట్లుగా నమోదైంది.

# మానవ మేధస్సు ముందు ఏఐ ఎంత?

**ఏఐ సాధనాలు మరింత అధునాతనంగా మారినప్పటికీ, కీలక నిర్ణయాలను తీసుకోవాల్సి వస్తే మానవ మేధస్సును ఏదీ భర్తీ చేయలేదని నిపుణులు భావిస్తున్నారు. అతిపెద్ద ప్రొఫెషనల్ నెట్‌వర్క్ అయిన లింక్డ్ఇన్ అధ్యయనం ప్రకారం కీలక నిర్ణయాలు తీసుకునే విషయంలో భారతదేశంలో 83% మంది నిపుణులు, హైదరాబాద్‌లోని 88% మంది నిపుణులు ఏఐపై ఆధారపడడం కంటే మానవ మేధస్సుకు ఓటేస్తున్నారు.**

**లింక్డ్ఇన్ అధ్యయనంలోని అంశాలు..**

హైదరాబాద్‌లో 79% మంది ఉద్యోగ విధుల్లో భాగంగా ఏఐని వాడుతున్నట్లు చెబుతున్న సమయంలో కీలక నిర్ణయాల విషయంలో మాత్రం ఏఐ సాయం తీసుకోకపోవడం గమనార్హం.

75% మంది తమ కెరియర్‌లో ఎదిగేందుకు ఏఐలో ప్రావీణ్యం సంపాదించడం అవసరమని భావిస్తున్నారు.

ఏఐలో నైపుణ్యం సాధించడం రెండో ఉద్యోగంలా అనిపిస్తుందని హైదరాబాద్‌లోని నలుగురు నిపుణుల్లో ముగ్గురు అంగీకరిస్తున్నారు.

59% మంది ఏఐని పూర్తి సామర్థ్యంతో ఉపయోగించడం లేదని చెబుతున్నారు.

75% మంది నిపుణులు ఏఐ తమ రోజువారీ పని జీవితాన్ని మెరుగుపరుచగలదని నమ్ముతున్నారు.

78% మంది నిపుణులు ఏఐని నిజమైన నిర్ణయం తీసుకోవడానికి కాకుండా రాయడం, డ్రాఫ్టింగ్‌కు ఉపయోగకరంగా భావిస్తున్నారు.

70% మంది ఉద్యోగ నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఏఐ కంటే కూడా తమ సొంత నిర్ణయాలనే నమ్ముతున్నారు.

భారతదేశంలో 83% మంది కార్యనిర్వాహకులు మంచి వ్యాపార నిర్ణయాలు మానవ మేధస్సుపైనే ఆధారపడి ఉంటాయని నమ్ముతున్నారు.

లింక్డ్ఇన్ కెరియర్ నిపుణులు, ఇండియా సీనియర్ మేనేజింగ్ ఎడిటర్ నీరజిత బెనర్జీ మాట్లాడుతూ ‘ఏఐ ఒక అద్భుతమైన సాధనం. ఇది వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఉపయోగపడుతోంది. రోజువారీ పనులను క్రమబద్ధీకరించగలదు. అయితే కీలక విషయాల్లో నిర్ణయం తీసుకునేప్పుడు చాలామంది ఏఐపై ఆధారపడడం లేదు. ఏఐని తాము విశ్వసించే సాధనంగానే కానీ, అనుసరించే సాధనంగా భావించడంలేదు. మానవులు మాత్రమే చేసే పని కోసం సమయాన్ని ఆదా చేసేందుకు ఏఐని ఉపయోగించాలి’ అని చెప్పారు.





# ద్విచక్ర వాహన విక్రయాలు పెరగొచ్చు.. ఇక్రా అంచనా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ద్విచక్ర వాహన విక్రయాలు 6-9% పెరగొచ్చని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. స్థిరమైన రిప్లేస్‌మెంట్ (పాత వాహనాన్ని మార్చి కొత్త వాహనాన్ని కొనుగోలు చేయడం), పట్టణ ప్రాంతాల్లో వినియోగ రికవరీ, సాధారణ వర్షపాతం నమోదుతో గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయాలు పెరగడం, జీఎస్‌టీ రేట్ల తగ్గింపు తదితర అంశాలు అమ్మకాల వృద్ధికి తోడ్పడతాయని రేటింగ్ సంస్థ తెలిపింది.

‘పరిశ్రమ అవుట్‌లుక్ ఇప్పట్టకి సానుకూల వైఖరి కలిగి ఉంది. స్థిరమైన డిమాండ్ ఉతమిస్తుంది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అంశం వృద్ధి వేగవంతం కావడానికి అదనపు ప్రోత్సాహాన్నిస్తుంది’ అని పేర్కొంది. పండుగ సీజన్‌కు ముందు ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మానుఫ్యాక్చరర్లు (ఓఈఎంలు) డీలర్లకు బలమైన పంపిణీ కారణంగా ఈ జూలైలో టూ వీలర్స్ హోల్‌సేల్ అమ్మకాలు 9% వృద్ధితో 15 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. ఇదే జూలైలో రిటైల్ అమ్మకాలు 6.5% క్షీణించాయి. పట్టణ ప్రాంతంలో డిమాండ్ స్తబ్ధత, అధిక వర్షపాతంతో గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోళ్లు తగ్గడం ఇందుకు కారణమని పేర్కొంది. ఎగుమతుల వృద్ధి సైతం కొనసాగొచ్చని తెలిపింది. రాబోయే పండుగ సీజన్ నాటికి రిటైల్ డిమాండ్ పుంజుకోవచ్చని రేటింగ్ ఏజెన్సీ చెప్పుకొచ్చింది.

# అమెజాన్ కొత్తగా మరో 40 ఆశ్రయ్ కేంద్రాలు



ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా తాజాగా తమ ఆశ్రయ్ ప్రాజెక్టును మరింతగా విస్తరించింది. ప్రభుత్వ రంగ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్)తో కలిసి మరో 40 కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో వీటి సంఖ్య 13 నగరాలవ్యాప్తంగా 65కి చేరింది. 2025 ఆఖరు నాటికి ఇలాంటి 100 సెంటర్స్ ఏర్పాటు చేయాలని నిర్దేశించుకున్నట్లు అమెజాన్ ఆపరేషన్స్ డైరెక్టర్ (ఇండియా) సలీం మెమన్ తెలిపారు.

పెట్రోల్ బంకులు మొదలైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఈ సెంటర్స్.. అమెజాన్ సొంత నెట్‌వర్క్‌లోని వారితో పాటు ఈ–కామర్స్, లాజిస్టిక్స్ వ్యవస్థలోని ఇతరత్రా డెలివరీ అసోసియేట్స్ కూడా కాసేపు సేద తీరేందుకు ఉపయోగపడతాయి. వీటిలో ఎయిర్ కండీషన్డ్ సీటింగ్, తాగు నీరు, మొబైల్ చార్జింగ్ పాయింట్లు, వాష్‌రూమ్‌లు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ మొదలైనవి ఉంటాయి. ఉదయం 9 గం.ల నుంచి రాత్రి 9 గం.ల వరకు, ఏడాదిపొడవునా, వారానికి ఏడు రోజులు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ట్రాఫిక్ రద్దీ, వాతావరణ మార్పులతో ఇబ్బందిపడే డెలివరీ అసోసియేట్స్ ప్రతి విజిట్‌లో అరగంట సేపు దీన్ని ఉపయోగించుకోవచ్చు.







# ఇది కలా.. నిజమా? నన్ను నేను గిల్లి చూసుకుంటున్నా..: మాళవిక మోహనన్

దర్శకుడు సత్యన్ అంతికాడ్, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ లాంటి లెజెండ్స్‌తో కలిసి పనిచేసే అవకాశం వస్తుందని తాను ఊహించ లేదని మాళవిక మోహనన్ సంతోషం వ్యక్తం చేసింది. మోహన్‌లాల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'హృదయపూర్వం' . సంగీత్ ప్రతాప్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 28న మలయాళంలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మాళవిక 'హృదయపూర్వం' మూవీకి పనిచేయడంపై సంతోషం వ్యక్తం చేసింది. అంతేకాదు, ఈ ఏడాది తనకెంతో ప్రత్యేకమని చెప్పింది.

"ఇద్దరు లెజెండ్స్‌తో కలిసి పనిచేశానా? అని ఇప్పటికీ నన్ను నేను గిల్లి చూసుకుంటున్నా. వారిద్దరూ ఊహాలకందని వ్యక్తులు. డెస్టినీ అంటే ఇదేనేమో. మిమ్మల్ని చిరునవ్వులతో ముంచెత్తడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఇందులో నేను హరిత అనే మోడ్రన్ గర్ల్‌గా నటిస్తున్నా. ఈ పాత్రకు నేను చాలా కనెక్టయ్యా. జీవితంలో ఏం చేయాలనుకుంటే అది చేసే అమ్మాయిగా కనిపిస్తా. ఇప్పుడు నేను చెబుతున్నదాని కంటే డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ తెరపై చూస్తారు" అని మాళవిక చెప్పుకొచ్చింది.

ఇక ఈ ఏడాది తనకెంతో ప్రత్యేకమని చెబుతూ సంతోషం వ్యక్తం చేసింది. మూడు ఇండస్ట్రీల నుంచి మూడు అద్భుతమైన సినిమాలతో ప్రేక్షకులను పలకరించనున్నట్లు పేర్కొంది. "ఆగస్టు 28న 'హృదయపూర్వం' రానుంది. కార్తితో కలిసి నటించిన 'సర్దార్2' షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఇక తెలుగులో నా మొదటి చిత్రం 'ది రాజాసాబ్'. ప్రభాస్‌తో కలిసి చేస్తున్న ఈ మూవీ ఈ డిసెంబరులో విడుదల కానుంది. ఈ సినిమాల కోసం నేనెంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా" అంటూ చిరునవ్వులు చిందించింది. 'ది రాజాసాబ్' మూవీ మారుతీ దర్శకత్వంలో రూపొందుతోంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రభాస్ కూడా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఆయనపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి.




# అల్లు అర్జున్‌తో హాలీవుడ్ పవర్ హౌస్.. బిగ్ ప్లాన్ రెడీ

అల్లు అర్జున్ సినిమా అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కబోతుంది. ఈమేరకు దర్శకుడు అట్లీ అందుకు సంబంధించిన ప్రణాళికలతో అడుగులు వేస్తున్నాడు. ప్రస్తుతం AA22XA6 పేరుతో ఈ చిత్రం ముంబైలో షూటింగ్ జరుపుకుంటుంది. అత్యంత భారీ బడ్జెట్‌తో సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం కొత్త టెక్నాలజీలను ఉపయోగిస్తున్నామని దర్శకుడు ఇప్పటికే వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌ను కేవలం ఇండియాకే పరిమితం కాకుండా హాలీవుడ్‌కు కూడా పరిచయం చేసేందుకు ప్రముఖ మార్కెటింగ్ సంస్థతో భాగస్వామ్యం అయింది. అల్లు అర్జున్ సినిమా విజువల్ ఎఫెక్ట్స్ కోసం హాలీవుడ్‌కి చెందిన స్పెక్ట్రల్ మోషన్ సంస్థ ఇప్పటికే పనిచేస్తుంది. ఆపై హాలీవుడ్ చిత్రాలకి పనిచేసిన పలువురు సాంకేతిక నిపుణులు ఈ చిత్రం కోసం వర్క్ చేస్తున్నారు. అయితే, అంతర్జాతీయ స్థాయిలో ఈ చిత్రాన్ని మార్కెట్ చేయడానికి హాలీవుడ్ స్టూడియోతో కూడా ఈ మూవీ టీమ్ కనెక్ట్ అయింది. హాలీవుడ్ ప్రముఖ మార్కెటింగ్ ఏజెన్సీ కనెక్ట్ మాబ్ సీన్ బన్నీ సినిమా కోసం పనిచేయనుంది. రెండు దశాబ్దాలకు పైగా ఈ సంస్థ అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలకు పవర్ హౌస్‌లా పనిచేసింది. ఇప్పుడు అల్లు అర్జున్ కోసం ఆ టీమ్ పనిచేయనుంది.

ఈ ఏజెన్సీకి చెందిన ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ క్రియేటివ్ కంటెంట్ 'అలెగ్జాండ్రా ఈ. విస్కోంటి' తొలిసారి ఇండియాకు వచ్చారు. ముంబైలో అల్లు అర్జున్, అట్లీని ఆమె కలుసుకున్నారు. ఈ చిత్రాన్ని గ్లోబల్ స్టాండర్డ్స్‌తో ప్రమోషన్ స్ట్రాటజీని సిద్ధం చేసేందుకు ప్లాన్ రెడీ చేసినట్లు తెలుస్తోంది. అవతార్, డ్యూన్, ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్, జురాసిక్ వరల్డ్, బార్బీ వంటి దిగ్గజ చిత్రాల కోసం ఆమె పనిచేశారు. AA22 చిత్రానికి మార్కెటింగ్ పరంగా ఆమె టీమ్ పనిచేయనుంది. అది గేమ్‌ఛేంజర్ అవుతుందని ఇండస్ట్రీ వర్గాలు తెలుపుతున్నాయి. హాలీవుడ్ చిత్రాలకు పవర్ హౌస్‌లా అలెగ్జాండ్రా పనిచేస్తుందని ఆమెకు పేరు ఉంది. దీంతో అల్లు అర్జున్ నటించే ఈ సినిమా హాలీవుడ్‌లో విడుదల కావాడం ఖాయం అని చెప్పొచ్చు.'



# 'వంద కేజీలకు పైగా బరువు.. ట్రోల్స్‌తో డిప్రెషన్‌కు గురయ్యా'

హీరోయిన్ సమీరా రెడ్డి తెలుగువారికి పరిచయం అక్కర్లేని పేరు. ఒక సమయంలో స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఆమె.. ఆ తర్వాత సినిమాలకు గుడ్‌బై చెప్పేసింది. అశోక్, జై చిరంజీవ లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన సమీరా.. 2014లో అక్షయ్‌ని వివాహం చేసుకుని ఇండస్ట్రీకి దూరమైంది. అయితే ప్రస్తుతం సమీరా సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు టచ్‌లోనే ఉంటోంది.

అయితే పెళ్లి తర్వాత తన శరీరంలో వచ్చిన మార్పులతో విపరీతంగా ట్రోలింగ్‌కు గురైనట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. తన బాడీపై ట్రోల్స్ చేయడంతో తీవ్రమైన నిరాశకు గురయ్యానని తెలిపింది. మొదటి బిడ్డ పుట్టిన తర్వాత హార్మోన్స్ ఇన్‌బ్యాలెన్స్ వల్ల చాలా బరువు పెరిగానని పేర్కొంది. ఈ సమయంలో కష్టకాలం ఎదుర్కొన్నట్లు తాజా ఇంటర్వ్యూలో పంచుకుంది. అప్పట్లో తన బరువు ఏకంగా 105 కేజీలకు చేరుకుందని తెలిపింది. బరువు పెరగడం వల్లే తనను ట్రోల్ చేశారని వివరించింది.

# కెరీర్‌లో అందుకే గ్యాప్ వచ్చింది: ఉదయభాను

చాలా రోజుల తర్వాత 'త్రిబాణధారి బార్బరిక్'తో మరోసారి స్క్రీన్‌పై మ్యాజిక్ చూపేందుకు నటి ఉదయభాను సిద్ధమయ్యారు. సత్యరాజ్‌తో కలిసి ఆమె కీలక పాత్రలో నటించిన చిత్రమిది . మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో ఈ సినిమా విశేషాలతో పాటు తన కెరీర్ గురించి ఉదయభాను పంచుకున్నారు.

"ఇన్ని రోజులు మంచి పాత్రలు, స్క్రిప్ట్ వినగానే ఓకే చెప్పాలి అనిపించే కథలు రాలేదు. కొన్ని సినిమాల్లో అవకాశం వచ్చింది. కానీ, వాటిల్లో కొన్ని సన్నివేశాలు నచ్చక రిజెక్ట్ చేశాను. అందుకే గ్యాప్ వచ్చింది. 'త్రిబాణధారి బార్బరిక్' నెరేషన్ చేసేటప్పుడే కళ్లకు కట్టినట్లు చూపించారు. డైరెక్టర్ శ్రీవత్స స్పెషల్ ఎఫెక్ట్‌లతో సహా వివరించారు. వెంటనే ఓకే చెప్పా. ఇందులో ఎన్నో ట్విస్ట్‌లు ఉన్నాయి. నేను గతంలో కొన్ని షోలకు వ్యాఖ్యాతగా వ్యవహరించాను. ఆ కార్యక్రమంలో పురాణాలపై ఎన్నో ప్రశ్నలే వచ్చేవి. అప్పటి నుంచే నాకు ఆసక్తి వచ్చింది" అని చెప్పారు.

# హనుమాన్ హీరో కొత్త మూవీ.. రిలీజ్ డేట్ ఇదే




బాలనటుడిగా కెరీర్ మొదలుపెట్టి.. హీరోగా 'హనుమాన్'తో పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న తేజా సజ్జా.. ఇప్పుడు 'మిరాయ్'తో రాబోతున్నాడు. ఇది సూపర్ హీరో తరహా సినిమానే. చాన్నాళ్లుగా వాయిదాలు పడుతూ వచ్చింది. ఫైనల్‌గా సెప్టెంబరు తొలివారం రిలీజ్ పెట్టుకున్నారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడిందని చెబుతూ కొత్త రిలీజ్ డేట్ ప్రకటించారు.

తేజా సజ్జా హీరోగా నటిస్తుండగా.. మంచు మనోజ్ విలన్‌గా చేస్తున్నాడు. రితికా నాయక్ హీరోయిన్. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్స్ మీడియా సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. ఈ చిత్రాన్ని తొలుత సెప్టెంబరు 5న రిలీజ్ చేయాలనుకున్నారు. మరి ఏమైందో ఏమో గానీ వారం ఆలస్యంగా అంటే సెప్టెంబరు 12న థియేటర్లలో తీసుకురానున్నట్లు ఇప్పుడు కొత్త పోస్టర్ వదిలారు.

అలానే ఈనెల 28న ట్రైలర్ రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ఈ సినిమా విడుదలకు ముందే పీపుల్స్ మీడియా సంస్థలో తేజా సజ్జా మరో చిత్రానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. రీసెంట్‌గానే ఆ ప్రకటన కూడా వచ్చింది. అయితే అది 'జాంబీరెడ్డి' సీక్వెల్ అని సోషల్ మీడియాలో టాక్ నడుస్తోంది.



# శ్రీదేవి ఆస్తి.. కోర్టును ఆశ్రయించిన బోనీ కపూర్



తన భార్య, దివంగత నటి శ్రీదేవి ఆస్తిని ముగ్గురు వ్యక్తులు కబ్జా చేశారంటూ బోనీ కపూర్ కోర్టును ఆశ్రయించారు. వారు చట్టవిరుద్ధంగా హక్కులను సొంతం చేసుకున్నారని ఆరోపించారు. ఆమె ఎంతో కష్టపడి ఆ స్థిరాస్తిని కొనుగోలు చేసిందని ఈ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. దాని వివరాలను కోర్టుకు వివరించారు.1988 ఏప్రిల్‌లో శ్రీదేవి మద్రాసులో ఎంసీ సంబంద మొదలియార్ అనే వ్యక్తి వద్ద స్థిరాస్తిని కొనుగోలు చేశారు. దానికి సంబంధించిన పత్రాలన్నీ పరిశీలించిన తర్వాతే ఆమె దాన్ని కొనుగోలు చేసినట్లు బోనీ కపూర్ తెలిపారు. అతడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారని, వారందరి దగ్గర వారసత్వ ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించిన తర్వాతనే శ్రీదేవి ఈ ఆస్తిని సొంతం చేసుకున్నట్లు బోనీ కపూర్ వెల్లడించారు. అయితే, ఎంసీ సంబంద మొదలియార్ రెండో భార్య కుమారులు ఈ ఆస్తిలో వారికి వాటా ఉందంటూ తహశీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేశారన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్ణయంతో తాజాగా చట్టవిరుద్ధంగా దీని హక్కులను సొంతం చేసుకున్నారని బోనీ కపూర్ హైకోర్టులో కేసు వేశారు. మోసపూరితమైన పత్రాలను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన భార్య బతికి ఉండగానే మొదలియార్ రెండో వివాహం చేసుకున్నారన్న విషయాన్నీ బోనీ కపూర్ ప్రస్తావించారు. విచారించిన జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ నాలుగు వారాల్లోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని.. ధ్రువీకరణ పత్రం ఇచ్చిన తాంబరం తాలూకా తహసీల్దార్‌ను ఆదేశించారు.



# తొలి పాటకు మంచి రెస్పాన్స్.. ఇప్పుడు మరో సాంగ్

ఓవైపు స్టార్ హీరోలతో పాన్ ఇండియా సినిమాలు చేస్తున్న రష్మిక.. మరోవైపు తెలుగులో ఫిమేల్ ఓరియెంటెడ్ మూవీలోనూ నటిస్తోంది. అదే 'గర్ల్ ఫ్రెండ్'. నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని లవ్ స్టోరీతో తీస్తున్నారు. 'దసరా' ఫేమ్ దీక్షిత్ శెట్టి.. రష్మిక సరసన నటిస్తున్నాడు. కొన్నిరోజుల క్రితం తొలి పాట రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మరో గీతాన్ని వదిలారు.

చిన్మయి పాడిన ఈ పాట.. మంచి మెలోడీయస్‌గా ఉంటూనే హీరోహీరోయిన్ మధ్య లవ్ ఎలా ఉండబోతుందనేది చూపించింది. ఒకే కాలేజీలో చదువుకునే ప్రధాన పాత్రధారుల మధ్య ప్రేమని చూపించే సీన్స్ అన్నీ ఈ పాటలో కనిపించాయి. చూస్తుంటే రష్మిక.. మరి హిట్ కొట్టేలా కనిపిస్తుంది. లెక్క ప్రకారం ఈ మూవీ ఈపాటికే రిలీజైపోవాలి. కానీ థియేటర్లలోకి వచ్చేది ఎప్పుడనేది క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# ఒకే బంతికి 2 సిక్సర్లు.. మొత్తంగా 16 సిక్సర్లు

**ప్రస్తుతం జరుగుతున్న కేరళ టీ20 క్రికెట్ లీగ్‌లో టీమిండియా ఆటగాడు సంజూ శాంసన్ సిక్సర్ల వర్షం కురిపిస్తున్నాడు. రెండు మ్యాచ్‌ల్లో ఏకంగా 16 సిక్సర్లు బాదాడు. తొలి మ్యాచ్‌లో 7 సిక్సర్లు.. రెండో మ్యాచ్‌లో మరింత రెచ్చిపోయి 9 సిక్సర్లు కొట్టాడు.**





ఇవాళ (ఆగస్ట్ 26) త్రిస్సూర్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజూ ఓ అరుదైన ఘనత సాధించాడు. నో బాల్ అయిన ఓ బంతికి రెండు సిక్సర్లు బాది 13 పరుగులు రాబట్టాడు. ఈ మ్యాచ్‌లో సంజూ 46 బంతులు ఎదుర్కొని 4 ఫోర్లు, 9 సిక్సర్ల సాయంతో 89 పరుగులు చేశాడు.

అంతకుముందు తొలి మ్యాచ్‌లో సంజూ విధ్వంసకర శతకం బాదాడు. అరైస్ కొల్లాం సైలర్స్‌పై 51 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 121 పరుగులు చేశాడు. సంజూ బీభత్సం ధాటికి సైలర్స్‌పై అతడు ప్రాతినిథ్యం వహిస్తున్న కొచ్చి బ్లూ టైగర్స్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. చివరి బంతికి ఆరు పరుగులు అవసరం కాగా.. ఆషిక్ సిక్సర్ కొట్టి టైగర్స్‌ను విజయతీరాలు దాటించాడు. త్రిస్సూర్ టైటాన్స్‌తో ఇవాళ జరిగిన మ్యాచ్‌లోనూ ఇంచుమించు ఇలాంటి డ్రామానే చోటు చేసుకుంది. అయితే గెలిచింది మాత్రం సంజూ జట్టు కాదు. సంజూ విధ్వంసం తర్వాత బ్లూ టైగర్స్ త్రిస్సూర్ ముందు 189 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో టైటాన్స్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయినప్పటికీ.. ఓపెనర్ అహ్మద్ ఇమ్రాన్ (72) ఒంటరిపోరాటం చేసి గెలుపుపై ఆశలు కోల్పోకుండా చేశాడు.

ఇమ్రాన్ ఔటయ్యాక టైటాన్స్‌ను గెలిపించే బాధ్యత కెప్టెన్ సిజిమోన్ జోసఫ్ (42 నాటౌట్), అర్జున్ (31 నాటౌట్) తీసుకున్నారు. చివరి 5 ఓవర్లలో గెలుపుకు 66 పరుగులు అవసరమైన దశలో సిజిమోన్, అర్జున్ చెలరేగి ఆడారు. వరుసగా ఓవర్‌కు 12, 16, 13, 10, 15 పరుగులు పిండుకున్నారు.

చివరి 3 బంతులకు 12 పరుగులు అవసరమైన తరుణంలో సిజిమోన్ సిక్సర్, డబుల్, బౌండరీ బాది తన జట్టును గెలిపించాడు. ఈ మ్యాచ్‌లో సంజూ ఔటైన తర్వాత బ్లూ టైగర్స్ ఇన్నింగ్స్ లయ తప్పింది. సంజూను ఔట్ చేసిన తర్వాత అజినాస్ అనే బౌలర్ వరుసగా మరో రెండు వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. సంజూ క్రీజ్‌లో ఉన్నంత సేపు టైగర్స్ స్కోర్ 200 పరుగుల మార్కును తాకేలా కనిపించింది. అయితే సంజూ ఔట్ కావడంతో పాటు ఆతర్వాత వరుసగా వికెట్లు కోల్పోవడంతో టైగర్స్ 188 పరుగులకే పరిమితమైంది.

ఇదిలా ఉంటే, ఆసియా కప్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో సంజూ శాంసన్‌కు చోటు దక్కిన విషయం తెలిసిందే. అయితే తుది జట్టులో అతని స్థానంపై మాత్రం అనుమానాలు నెలకొన్నాయి. రెగ్యులర్ ఓపెనర్‌గా శుభ్‌మన్ గిల్ రీఎంట్రీ ఇవ్వడమే ఇందుకు కారణం. గిల్.. అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తాడని టీమిండియా మేనేజ్‌మెంట్ సంకేతాలిచ్చింది.

ఒకవేళ సంజూను తుది జట్టులో తీసుకున్నా మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు పంపే అవకాశం ఉంది. అయితే మిడిలార్డర్‌లో అతడికి అంత మంచి ట్రాక్ రికార్డు లేదు. కేరళ లీగ్‌లో ఓపెనర్‌గా సంజూ భీకర ఫామ్‌ను చూసిన తర్వాత టీమిండియా మేనేజ్‌మెంట్ ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



## ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌ను వదిలేసిన హనుమ విహారి

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌ని ప్రముఖ క్రికెటర్ హనుమ విహారి వదిలేశారు. త్రిపుర రాష్ట్రానికి ఆయన ప్రాతినిధ్యం వహించనున్నారు. 2025 26 కోసం కాంట్రాక్టు కుదుర్చుకున్న విహారి.. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌తో విసిగి.. ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. సీనియర్ ప్లేయర్ అయిన తనకి అవకాశాలు ఇవ్వటం లేదని.. మూడు ఫార్మాట్లలో ఆడే సత్తా ఉన్నా కానీ అవకాశం ఇవ్వట్లేదని హనుమ విహారి ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియా జట్టులో సైతం ఆడి తన ప్రతిభ కనబర్చిన విహారికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రాధాన్యత ఇవ్వలేదు. దీంతో ఏపీని వదిలి కొత్త వాతావరణంలో ఆడాలని ఆయన నిర్ణయించారు. క్రీడల్లో కూడా కూటమి సర్కార్ రాజకీయాన్ని చొప్పించిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



## మరణించిన భారత క్రికెటర్ల భార్యలకు ఆర్థిక చేయూత

భారత క్రికెటర్స్ అసోసియేషన్ (ICA) కీలక నిర్ణయం తీసుకుంది. మరణించిన భారత క్రికెటర్ల భార్యలకు రూ. లక్ష గ్రాంట్‌ను ప్రకటించింది. ఈ మొత్తాన్ని అర్హులైన వితంతువులకు ఒక్కసారిగా చెల్లిస్తారు. ఈ స్కీమ్ తొలి దఫాలో దాదాపు 50 మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉంది. మాజీ క్రికెటర్ల కుటుంబాలకు అండగా నిలిచే ప్రక్రియలో భాగంగా ఈ స్కీమ్‌ను ప్రవేశపెట్టినట్లు ICA తెలిపింది.

ఈ పథకానికి ప్రస్తుతం అమల్లో ఉన్న మిగతా పథకాలతో సంబంధం లేదు. అవి కొనసాగుతుండగానే, ఈ కొత్త పథకం అమల్లోకి వస్తుంది. ICA ఇప్పటికే మరణించిన భారత మాజీ టెస్ట్ క్రికెటర్ల భార్యలకు నెలసరి పెన్షన్ ఇస్తుంది. కొత్త పథకానికి ICA వార్షిక సంవత్సర రెండో బోర్డు మీటింగ్‌లో ఆమోదం లభించింది.

కాగా, మాజీ క్రికెటర్ల కుటుంబాలకు అండంగా నిలవడమే ధ్యేయంగా ICA ఏర్పాటు చేయబడింది. దీన్ని 2019లో స్థాపించారు. ICAలో 1750కు పైగా భారత మాజీ క్రికెటర్లు సభ్యులుగా ఉన్నారు. ICA ఇప్పటికే 60 దాటి, పెన్షన్ లభించని మాజీ క్రికెటర్లకు సీనియర్ మెంబర్ రికగ్నిషన్ ప్రోగ్రామ్ కింద రూ. లక్ష ఆర్థిక సాయం చేస్తుంది.

అలాగే సభ్యుల కుటుంబాలకు రూ. 2.5 లక్షల గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ కూడా ప్రొవైడ్ చేస్తుంది. వీటికి అదనంగా ప్రతి సభ్యుడికి ఏడా




## నిప్పులు చెరిగిన ఉమ్రాన్ మాలిక్.. బెంబేలెత్తిపోయిన బ్యాటర్లు

**టీమిండియా ఫాస్ట్ బౌలర్, జమ్మూ కశ్మీర్ ఎక్స్‌ప్రెస్ ఉమ్రాన్ మాలిక్ రీఎంట్రీలో అదరగొట్టాడు. బుచ్చిబాబు టోర్నీలో భాగంగా ఒడిషాతో జరిగిన మ్యాచ్‌లో రాకెట్ వేగంతో బంతులు సంధించి, వరుస బంతుల్లో వికెట్లు తీశాడు. ఈ రెండు వికెట్లు క్లీన్ బౌల్డ్ రూపంలో వచ్చాయి. రీఎంట్రీలో ఉమ్రాన్ పూర్వవైభవం సాధించాడు. తనను ప్రత్యేకంగా నిలిపిన వేగాన్ని కొనసాగించాడు. నిప్పులు చెరిగే బంతులు సంబంధించి ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించాడు. 10 ఓవర్లు వేసిన ఉమ్రాన్ 35 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు.**



ఈ మ్యాచ్‌లో జమ్ము కశ్మీర్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. రెండో ఓవర్ చివరి బంతికే ఉమ్రాన్ ఓం ముండే వికెట్ తీశాడు. ఆతర్వాత నాలుగో ఓవర్ తొలి బంతికి ఒడిషా కెప్టెన్ సుభ్రాంషు సేనాపతి వికెట్ తీశాడు. హ్యాట్రిక్ కోసం ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఉమ్రాన్ తీసిన రెండు వికెట్లు తొలి రోజు ఆట మొత్తానికి హైలైట్‌గా నిలిచాయి. ఉమ్రాన్ వేగానికి వికెట్లు గాల్లోకి పల్టీలు కొట్టాయి.

ఉమ్రాన్ మెరుపులకు ఆబిద్ ముస్తాక్, వన్షజ్ శర్మ నాలుగు వికెట్ల ప్రదర్శనలు కూడా తోడవ్వడంతో జమ్మూ కశ్మీర్ ఒడిషాను తొలి రోజే 314 పరుగులకు ఆలౌట్ చేసింది.

25 ఏళ్ల ఉమ్రాన్ గాయాల కారణంగా గత కొంతకాలంగా ఆటకు దూరంగా ఉన్నాడు. అతను చివరిగా గతేడాది మార్చిలో కాంపిటేటివ్ క్రికెట్ ఆడాడు. 2022లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఉమ్రాన్.. భారత్ తరఫున 8 టీ20లు, 10 వన్డేలు ఆడాడు. ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శనల కారణంగా ఉమ్రాన్‌కు భారత జట్టులో చోటు దక్కింది. సన్‌రైజర్స్‌కు ఆడుతూ అతడు మంచి పేరు గడించాడు.

అయితే గాయాల కారణంగా తరుచూ ఇబ్బంది పడ్డాడు. భారత క్రికెట్‌లో అత్యంత అరుదుగా కనిపించే ఫాస్ట్ బౌలర్లలో ఉమ్రాన్ ఒకడు. అతను క్రమంగా 150 కిమీకి పైగా వేగంతో బంతులు సంబంధించగలడు. భారత క్రికెట్‌లో ఇలా చేయడం చాలా తక్కువ మందికి మాత్రమే సాధ్య పడుతుంది.

## బుమ్రా జట్టులో లేనప్పుడే.. నేను ఎందుకు బాగా ఆడతానంటే.. : మహ్మద్ సిరాజ్

**టీమ్‌ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్ ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్ టూర్‌లో తన సత్తా చాటాడు. అయిదు టెస్టుల్లో ఏకంగా 23 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అలాగే రెండు సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు. ముఖ్యంగా ఆఖరి టెస్టులో టీమ్‌ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో భారతజట్టు ఈ సిరీస్‌ను 2-2తో సమం చేసుకుంది. వర్క్‌లోడ్ నేపథ్యంలో జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడగలిగాడు. అతడి గైర్హాజరీలో పేస్ దళాన్ని సిరాజ్ ముందుండి నడిపించాడు. బుమ్రా జట్టులో లేనప్పడు తాను మరింత మెరుగ్గా రాణించడానికి గల కారణాన్ని అతడు ఓ ఇంటర్వ్యూలో వివరించాడు.**



'బాధ్యతను మోయడానికి నాకు అవకాశం వచ్చినప్పుడు.. నేను ఒక సాధారణ సిరీస్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేస్తాను. బాధ్యత నాలో ఆనందాన్ని రేకెత్తిస్తుంది. ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతుంది. జస్‌ప్రీత్ బుమ్రా వెన్ను గాయం కారణంగా కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో లేడు. అలాగే అతడి వర్క్‌లోడ్ నేపథ్యంలో బౌలింగ్ యూనిట్‌లో సానుకూల వాతావరణాన్ని కొనసాగించడానికి నావంతు ప్రయత్నం చేస్తున్నాను. నేను నా సహచరులు, ఆకాశ్ దీప్ ఇతర బౌలర్లతో మాట్లాడుతున్నప్పుడు.. మనం దీన్ని సాధించగలమనే నమ్మకాన్ని వారిలో కలిగించేందుకు కృషి చేశా. మనం ఇప్పటికే సాధించిన వాటిని మళ్లీ చేసి చూపించవచ్చని వారితో చెప్పాను' అని సిరాజ్ వివరించాడు.

మహ్మద్ సిరాజ్ ఇప్పటి వరకు టీమ్‌ఇండియా తరఫున 41 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. 31.1 యావరేజ్‌తో 123 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. 5 సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అలాగే 44 వన్డేల్లో 24 యావరేజ్‌తో 32 వికెట్లు తీసుకున్నాడు. ఒక్కసారి అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు. 16 టీ20ల్లో 32.3 యావరేజ్‌తో 14 వికెట్లు పడగొట్టాడు. ఇంకా 108 ఐపీఎల్ (IPL) మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ 30.7 యావరేజ్‌తో 109 వికెట్లు కూల్చాడు.